జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || మంగళవారం 03, డిసెంబర్ 2024 || ఎడిటర్ : మార్తి సుబ్రహ్మణ్యం


## గ్రామ-వార్డు సచివాలయాల పునర్ వ్యవస్థీకరణపై ప్రభుత్వం ఫోకస్

- సమర్ధవంతమైన సేవలు అందించేలా తీర్చిదిద్దే అంశంపై కసరత్తు



అమరావతి,మహానాడు:

గ్రామ - వార్డు సచివాలయ వ్యవస్థలో సమూల మార్పులు తీసుకువచ్చి, మరింత అర్థవంతంగా, పటిష్టంగా ఈ వ్యవస్థను తయారు చేసి ప్రజలకు ఉపయోగకరంగా నిలపాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భావిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం జీఎస్‌డబ్ల్యూఎస్ పై తన నివాసంలో ముఖ్యమంత్రి సమీక్ష జరిపారు.

అటు గ్రామాల్లోనూ-ఇటు పట్టణ, నగర ప్రాంతాల్లోనూ సచివాలయాలు మిగతా.. 2లో

కాకినాడ కాజా

# బియ్యం బొక్కుతున్న ప్రతినిధులు

- ఎమ్మెల్యేల గొంతులో పవన్ పచ్చివెలక్కాయ
- అక్రమ బియ్యం దందాలో ఒక్కో ఎమ్మెల్యేకు 20 నుంచి 30 లక్షల మామూళ్లు
- ఇప్పుడు పవన్ అడ్డుచక్రంతో ఆగిపోనున్న ఎమ్మెల్యేల ఆదాయం
- తాజాగా రేషన్‌షాపుల నుంచి నిలిచిపోయిన కొనుగోళ్లు
- భయంతో కొనుగోళ్లు ఆపేసిన బ్రోకర్లు
- కాకినాడ, రాజమండ్రి రైస్‌మిల్లుల్లోనే రీసైక్లింగ్?
- బడా ట్రాన్స్‌పోర్టర్లలో ఒకే కులానికి చెందిన వారే ఎక్కువ
- కాకినాడ-రూరల్ ప్రతినిధుల మధ్య వాటాల వార్
- అధికారం లేకున్నా చక్రం తిప్పుతున్న ద్వారంపూడి?
- కూటమి నేతలతో కలిసి వ్యాపారం చేస్తున్నారంటూ గుసగుసలు
- గుంటూరు-ప్రకాశం జిల్లాలకు ఆ మంత్రిగారి అనుచరుడే 'సారధి'

(మార్తి సుబ్రహ్మణ్యం)

**ఎంకిపెళ్లి సుబ్బిచావుకొచ్చినట్లు.. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అక్రమ బియ్యం రవాణాపై చేస్తున్న హడావిడి, చేస్తున్న ప్రకనటలు ఎమ్మెల్యేల చావుకొచ్చిపడుతోంది. రేషన్‌షాపుల నుంచి పంపిణీ చేయాల్సిన బియ్యం పక్కదారి పట్టి.. కాకినాడ పోర్టు నుంచి ఆఫ్రికాకు వెళుతున్న వైనంపై.. పవన్ కల్యాణ్ అగ్గిరాముడైన వైనం, బియ్యం బ్రోకర్లకు దడ పుట్టిస్తోంది. అదే సమయంలో నెలకు లక్షలాది రూపాయల ముడుపుల ఆదాయం పోతుండటం అటు ఎమ్మెల్యేలకు మింగుడుపడకుండా ఉంది.**







మహానాడు ఫోకస్

ఒక్కో రేషన్‌షాపు నుంచి కిలోకి 15 రూపాయలకు కొనుగోలు చేస్తున్న బ్రోకర్లు.. దానిని రీసైక్లింగ్ చేసిన తర్వాత ఎగుమతిదారులకు 70 రూపాయలకు అమ్ముతున్నారన్న ఆరోపణలు ఎప్పటినుంచో ఉన్నవే. జగన్ జమానాలో కూడా ఇదే రేటు. ఏ ప్రాంతానికి ఆ ప్రాంతంలోకి బ్రోకర్లు స్థానికంగా ఉన్న రేషన్‌షాపుల నుంచి బియ్యం సేకరిస్తుంటారు. రేషన్‌షాపుల యజమానులు రేషన్‌కార్డుదారులకు కిలో 10 రూపాయలు చెల్లించి, ఆ బియ్యం కొనుగోలు చేస్తారు. దానిని బ్రోకర్లకు 15 రూపాయలకు అమ్ముతున్నారు.

వీటిని కాకినాడ పరిసర ప్రాంతాల్లోని రైస్‌మిల్లులకు తరలించి, అక్కడే రీ సైక్లింగ్ చేయించి, లారీల ద్వారా పోర్టుకు తరలిస్తుంటారు. ఇది చాలాకాలం నుంచి విజయవంతంగా కొనసాగుతున్న అమ్మకం-కొనుగోలు వ్యవస్థ. వాటిని కాకినాడ పోర్టుకు తరలించేందుకు బడా ట్రాన్స్‌పోర్టర్లు ఉన్నారు. మొత్తం 28 మంది ట్రాన్స్‌పోర్టర్లలో 20 మంది ఒకే సామాజికవర్గానికి చెందన వారే కావటం ఆశ్చర్యం. వీరిలో ఆర్ధికమంత్రి పయ్యావుల కేశవ్ వియ్యంకుడు కూడా ఉన్నారని, వైసీపీ నేత బొత్సనత్యనారాయణ, అంబంటి రాంబాబు, పేర్ని నాని ఆరోపణలు గుప్పించారు.

కాగా జగన్ జమానాలో మంత్రిగా పనిచేసిన ఓ గోదావరి జిల్లా ప్రముఖుడికి రైస్‌మిల్లులు చాలా ఉన్నాయి. అప్పట్లో ఈ బియ్యం వ్యవహారంలో ఆయనదే కీలకపాత్ర అనే అరోపణలు వెల్లువెత్తిన విషయం తెలిసిందే. జగన్ హయాంలో ఈ బియ్యం మాఫియా కొత్తరూపు దాల్చి, అప్పటి ప్రభుత్వం కొనుగోలు చేసిన వాహనాల ద్వారా, గ్రీన్‌చానెల్ ఏర్పాటు చేసి అసలు షాపులకు బియ్యం సరఫరా చేయకుండానే, నేరుగా బ్రోకర్లను పంపించేవారని స్వయంగా పౌరసరఫరాల శాఖమంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించడం విశేషం.

ఇక స్థానికంగా రేషన్‌షాపుల నుంచి బియ్యం కొనుగోలు చేసిన బ్రోకర్లు లారీల్లో తరలించాలంటే, స్థానిక ఎమ్మెల్యేల అనుమతి తప్పనిసరి. దానికోసం వారు ఒక్కో ఎమ్మెల్యేలకు 20 నుంచి 30 లక్షల రూపాయలు ముడుపులుగా చెల్లిస్తున్నారన్నది బహిరంగ రహస్యం. కూటమి ప్రభుత్వంలోనూ ఈ వ్యాపారం విజయవంతంగా జరుగుతోంది. గుంటూరు-ప్రకాశం జిల్లాలకు చెందిన రేషన్‌షాపు డీలర్లనుంచి అద్దంకి నియోజకవర్గానికి చెందిన ఓ టీడీపీ రాష్ట్ర నేత అనుచరుడే ఈ కొనుగోళ్లకు సారధిగా ఉన్నారన్నది బహిరంగమే. ఇప్పుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కాకినాడ పోర్టులోకి వెళ్లి, హడావిడి చేయడం ఎమ్మెల్యేలకు మింగుడుపడకుండా ఉంది. ఎక్కడ తమ ఆదాయానికి గండిపడుతుందోనన్నదే ఆ భయానికి కారణం.

అందుకు తగినట్లుగానే తాజాగా బ్రోకర్లు బియ్యం కొనుగోళ్లు నిలిపివేశారని సమాచారం. ఈ నెల వచ్చిన కోటాను బ్రోకర్లు కొనుగోలు చేయలేదట. దీనిపై ప్రభుత్వం సీరియస్‌గా ఉండటం, సీఎం చంద్రబాబుతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ భేటీ అయిన నేపథ్యంలో.. బ్రోకర్లు ఈసారికి బియ్యం కొనుగోలు నిలిపి వేసినట్లు చెబుతున్నారు. బియ్యం వ్యవహారం ఎప్పుడు కొలిక్కివస్తుందో తెలియనందున, ఆ సమస్యకు పరిష్కారమయ్యే వరకూ ఈ దందాను తాత్కాలికంగా నిలిపివేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఫలితంగా ఎమ్మెల్యేల ఆదాయానికీ గండిపడినట్లయింది. నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలకు క్రమం తప్పకుండా వచ్చే ఆదాయంలో ఈ బియ్యం వ్యవహారం ఒకటి.

కాగా జగన్ జమానాలో చక్రం తిప్పిన కాకినాడ వైసీపీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి హవా, ఇప్పటికీ విజయవంతంగా కొనసాగుతుండటమే ఆశ్చర్యం. నిజానికి ద్వారంపూడి కుటుంబం, బియ్యం వ్యవహారంలో తొలినుంచీ కీలకపాత్ర పోషిస్తోందన్నది బహిరంగమే. కాకినాడ మిగతా.. 2లో



03

రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం



03

దళిత బంధును ఆపిన దద్దమ్మ రేవంత్ రెడ్డి



03

నామినేటెడ్ పోస్టులపై కసరత్తు



03

సీఎంకు మంత్రివర్గ విస్తరణ చేసే దమ్ము లేదు



04

కేసీఆర్ మొక్క కాదు... వేగు చుక్క



06

అప్పు తీర్చమంటే ఎంపీ వైఎస్ అవినాష్ పేరు చెప్పి బెదిరిస్తున్నారు!

## ఫెంగల్ తుఫాన్ ప్రభావం..

### - సహాయక చర్యలపై చంద్రబాబు సమీక్ష



- మరో రెండు రోజులు అప్రమత్తంగా ఉండి పనిచేయాలని అధికారులకు సీఎం సూచన
- జిల్లాల్లో తాజా పరిస్థితిని, సహాయక చర్యలను వివరించి అధికారులు

అమరావతి,మహానాడు:

ఫెంగల్ తుఫాను ప్రభావం, ప్రభుత్వ సహాయక చర్యలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్షించారు. ఉండవల్లిలోని తన నివాసంలో సీఎం నిర్వహించిన సమీక్షకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ సహా పలువురు అధికారులు పాల్గొన్నారు.

తుఫాన్ ప్రభావంతో గత 5 రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 31 ఎంఎం వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు. ఇందులో తిరుపతి జిల్లాలో 178 ఎ.ఎం, చిత్తూరు జిల్లాలో 93 ఎం.ఎం, నెల్లూరు జిల్లాల్లో 88 ఎంఎం, అన్నమయ్య జిల్లాలో 65 ఎం.ఎం వర్షపాతం నమోదైనట్లు తెలిపారు. మొత్తం 53 మండలాల్లో తుఫాను ప్రభావం ఉందని....భారీ వర్షాలు ఉన్న ప్రాంతాల్లో రిలీఫ్ క్యాంప్ లు ఏర్పాటు చేసి ప్రజలను తరలించినట్లు అధికారులు తెలిపారు. మిగతా.. 2లో

## రాజధానిలో ప్రధాన భవనాలు, రోడ్లకు నిధులు

- సీఎం చంద్రబాబు అధ్యక్షతన సీఆర్డీయే అథారిటీ సమావేశం
- పాలనాపరమైన అనుమతులకు ఆమోదం
- పురపాలక శాఖ మంత్రి నారాయణ వెల్లడి



అమరావతి, మహానాడు:

అమరావతి, మహానాడు: గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం మూడు ముక్కలాటతో అమరావతిని నిర్వీర్యం చేసింది.. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పలు కమిటీలు వేసి నివేదికల ఆధారంగా ముందుకెళ్తున్నాం.. 11,467 కోట్ల విలువైన పనులకు టెండర్లు ఆహ్వానించేందుకు అథారిటీ సమావేశంలో నిర్ణయించినట్టు పురపాలక శాఖ మంత్రి నారాయణ వెల్లడించారు. సీఎం చంద్రబాబు అధ్యక్షతన సీఆర్డీయే 41వ అథారిటీ సమావేశం జరిగిందని, మొత్తం 23 అంశాలకు అథారిటీ ఆమోదం తెలిపినట్టు మంత్రి పేర్కొన్నారు. 360 కిమీల ట్రంక్ రోడ్లలకు 2498 కోట్లతో కొన్ని రోడ్లకు పనులు ప్రారంభానికి ఆమోదం తెలిపినట్టు చెప్పారు.

వరద నివారణకు 1585 కోట్లతో పాల వాగు, కొండవీటి వాగు, గ్రావిటీ కెనాల్‌తో పాటు రిజర్వాయర్లు మిగతా.. 2లో

## ఈ పది నెలల్లోనే అద్భుతాలు జరుగుతాయా?

- మనం చేయాల్సింది చేశాం
- ప్రభుత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మీదే
- తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్,మహానాడు:

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పది నెలలే అవుతోందని, ఈ పది నెలల్లోనే అద్భుతాలు జరుగుతాయా? అయినా ఈ కాలంలో మనం చేయాల్సింది



చేశామని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై జరుగుతోన్న అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. మీరు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని కాపాడుకోవాల్సిన మిగతా.. 2లో



## రాష్ట్ర విభజన అంశాలపై ఏపీలో తొలిసారి అధికారుల కీలక భేటీ!

- ఆస్తుల పంపకాలపై ప్రధానంగా చర్చ

అమరావతి, మహానాడు:

రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టంలోని విభజన అంశాలపై చర్చించేందుకు తెలుగు రాష్ట్రాలకు చెందిన ఉన్నతాధికారుల కమిటీ భేటీ అయింది. ఏపీలో తొలిసారిగా ఈ భేటీ జరిగింది. ఇరు రాష్ట్రాల సీఎస్‌ల నేతృత్వంలో అధికారుల కమిటీ సమావేశమైంది. విభజన చట్టంలోని 9, 10 షెడ్యూల్‌లోని సంస్థల ఆస్తుల పంపకాలపై ప్రధానంగా చర్చించారు. విద్యుత్ బకాయిలు, ఉమ్మడి సంస్థల మిగతా.. 2లో

## జగన్ కేసులన్నీ పట్టిక రూపంలో ఇవ్వండి

- రోజువారీ విచారణకు ఎందుకు ఆలస్యమవుతోంది?
- హైకోర్టు చెప్పినా విచారణ జరగలేదంటే దీని సంగతి తేలుస్తాం
- జనవరికి వాయిదా వేయాలన్న జగన్ అభ్యర్థనకు సుప్రీం నో



న్యూఢిల్లీ,మహానాడు:

మాజీ సీఎం, వైసీపీ అధినేత , వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బెయిల్ రద్దుపై సుప్రీం కోర్టులో విచారణ వాయిదా పడింది. జగన్ బెయిల్‌ను రద్దు చేయడమే కాకుండా కేసు విచారణను వేరే రాష్ట్రానికి బదిలీచేయాలంటూ గతంలో సుప్రీంలో ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామ పిటీషన్ దాఖలు చేశారు.

ఈ పిటిషన్‌ను జస్టిస్ అభయ్ ఓకా నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. జగన్ అక్రమాస్తుల కేసుల విచారణ పురోగతి ఏ దశలో ఉందని సుప్రీం ధర్మాసనం ప్రశ్నించింది. సీబీఐ కోర్టు, హైకోర్టు, సుప్రీంకోర్టులో జగన్ అక్రమాస్తులపై దాఖలైన కేసుల వివరాలను పట్టిక రూపంలో ఇవ్వాలని ధర్మాసనం ఆదేశించింది.

రోజు వారీ విచారణకు ఆదేశించినా ఎక్కడ ఆటంకం కలుగుతుందని ప్రశ్నించింది. ఏఏ కోర్టులలో ఏఏ కేసులు దాఖలయ్యాయి? వాటి విచారణ ఏ దశలో ఉందో తెలుపుతూ సమగ్రంగా పట్టిక రూపంలో ఇవ్వాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అఫిడవిట్ రూపంలో ఇచ్చిన పట్టిక చూసిన తరువాత ఏం చేయాలో చెబుతామని జస్టిస్ అభయ్ ఓకా నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. తదుపరి విచారణను డిసెంబర్ 13కు సుప్రీం కోర్టు వాయిదా వేసింది.

గతంలో జగన్ ఏపీ సీఎంగా ఉన్నప్పుడు రఘురామకృష్ణ రాజు మిగతా.. 2లో

జనం గుండె చప్పుడు

# మహానాడు

2

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ ||మంగళవారం 03, డిసెంబర్ 2024||



వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్ ను పరిశీలించిన సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, మంత్రి పొన్నం ప్రభాకర్, ముఖ్యమంత్రి సలహా దారు వేం నరేందర్ రెడ్డి.



## విశాఖ మెట్రోరైలు డీపీఆర్‌కు ప్రభుత్వం ఆమోదం

**న్యూఢిల్లీ:** విశాఖ మెట్రోరైల్ ప్రాజెక్టు తొలిదశ డీపీఆర్ కు ఏపీ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. తొలి దశలో 46.23 మేర మూడు కారిడార్లను నిర్మించనున్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ నుంచి కొమ్మాది వరకు 34.4 కి.మీ మేర ఒకటో కారిడార్, గురుద్వార నుంచి పాత పోస్టాఫీస్ వరకు 5.08 కి.మీ మేర రెండోది, తాటిచెట్ల పాలెం నుంచి చినవాల్తేర్ వరకు 6.75కి.మీ మేర మూడో కారిడార్ ప్రభుత్వం యంత్రాంగం నిర్మించనున్నారు.



ఢిల్లీలో కేంద్ర ఉక్కు మరియు భారీ పరిశ్రమల మంత్రి హెచ్.డి. కుమారస్వామిని కలిసి విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ, పెట్టుబడుల ఉపసంహరణను పునఃపరిశీలించాలని వినతిపత్రం అందజేసిన వైఎస్సార్సీపీ ఎంపీల బృందం

## రాజధానిలో ప్రధాన భవనాలు, రోడ్లకు నిధులు

**మొదటి పేజీ తరువాయి..**

నిర్మాణానికి, గెజిటెడ్, నాన్ గెజిటెడ్, క్లాస్-4, ఆల్ ఇండియా సర్వీస్ అధికారుల భవనాల పనులను 3523 కోట్లతో చేపట్టేందుకు, రైతులకు ఇచ్చిన రిటర్నబుల్ లే అవుట్ లలో రోడ్లు, మౌలిక వసతుల కల్పనకు 3859 కోట్లకు అను మతి మంజూరు చేస్తూ అథారిటీ అమోదించినట్టు మంత్రి వెల్లడిం చారు. ఆయా పనులకు వెంటనే టెండర్లు పిలిచి జనవరి నుంచి పనులు ప్రారంభిస్తామని ఆయన చెప్పారు. ఇంకా, ఆయన ఏమ న్నారంటే.. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, స్ట్రీట్ లైట్స్, మంచినీరు, ల్యాండ్ స్పింగ్... ఇంటర్నేషనల్ స్టాండర్డ్ లో చేయాలని సీఎం ఆదేశించారు. 5 ఐకానిక్ టవర్లు, అసెంబ్లీ, హైకోర్టు భవనాలు డిజైన్లకు టెండర్లు పిలిచాం..

డిసెంబర్ నెలాఖరుకు ఐకానిక్ భవనాలు కు టెండర్లు పిలుస్తాం. గత ప్రభుత్వం రైతులను అనేక రకాలుగా ఇబ్బంది పెట్టింది. ఆడవారిని కూడా హింసించారు. రాజధాని అమరావతిలో ఉండకూడదని ప్రయత్నం చేశారు. 5 కోట్ల మంది రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం రాబోయే మూడేళ్లలో అమరావతిని పూర్తి చేస్తాం.

## రాష్ట్ర విభజన అంశాలపై ఏపీలో తొలిసారి అధికారుల కీలక భేటీ!

**మొదటి పేజీ తరువాయి..**

ఖర్చులను తిరిగి చెల్లించే అంశంతో పాటు విభజన పూర్తికాని సంస్థలకు చెందిన నగదు నిల్వలపైనా చర్చించనున్నారు. పంపకం కాకుండా మిగిలిపోయిన రూ.8వేల కోట్ల అంశంపై చర్చించిట్టు సమాచారం. ఈ ఏడాది జులై అయిదోతేదీన తెలుగు రాష్ట్రాల సీఎంలు చంద్రబాబు, రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లోని ప్రజా భవన్ వేదికగా భేటీ అయిన విషయం తెలిసిందే. ఆ భేటీకి కొనసాగింపుగా ఇరు రాష్ట్రాలకు చెందిన ఉన్నతాధికారులు సమావేశమయ్యారు. ఈ కీలక భేటీలో ఏపీ నుంచి సీఎస్, ఆర్థిక శాఖ కార్యదర్శి, హోంశాఖ కార్యదర్శి, ఎక్సైజ్‌శాఖ ముఖ్యకార్యదర్శి, జెన్‌కో సీఎండీ, వాణిజ్య పన్నుల శాఖ చీఫ్ కమిషనర్ హాజరు కాగా తెలంగాణ నుంచి సీఎస్, ఆర్థిక, హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు తదితరులు హాజరయ్యారు.

## ఫెంగల్ తుఫాన్ ప్రభావం..

**మొదటి పేజీ తరువాయి..**

ప్రాథమిక అంచనాల ప్రకారం 6,824 హెక్టార్ల మేర వ్యవసాయ పంటలు దెబ్బతిన్నాయని అధికారులు వివరించారు. భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించాలని.... దీనికి అవసరమైన ఎన్యుమరేషన్ ప్రక్రియ పూర్తి చెయ్యాలని ముఖ్యమంత్రి సూచించారు. వర్షం కారణంగా తడిచిన ధాన్యం ఉంటే రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోలు చెయ్యాలని సిఎం సూచించారు. వర్షాల ప్రభావం పూర్తిగా తగ్గే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎం సూచించారు.

## తమిళనాడును ఊపేస్తున్న తుపాను!

**చెన్నై:** తమిళనాడులో భారీ వర్షాలు వల్ల కార్లు, బస్సులు కొట్టుకుపోతున్నాయి. 'ఫెంగల్' తుపాను ప్రభావంతో తమిళనాడు వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తు న్నాయి. భారీ వరదలకు రోడ్డుపై నిలిపిన వాహనాలు కొట్టుకుపో తున్నాయి. పుదుచ్చేరి, విల్లుపురం, తిరువన్నామలై, ధర్మపురి జిల్లాలపై



తుపాను ప్రభావం చూపుతోంది. రోడ్లపై నీరు ప్రవహిస్తుండటంతో చాలా ప్రాంతాల్లో రాకపోకలు స్తంభించిపోయాయి.

# జగన్ కేసులన్నీ పట్టిక రూపంలో ఇవ్వండి

**మొదటి పేజీ తరువాయి..**

ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. జగన్ బెయిల్‌ను రద్దు చేయాలని, సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందని, తెలంగాణ సీబీఐ కోర్టులో విచారణ మందకొడిగా సాగుతోందని, విచారణను వేరే రాష్ట్రానికి బదిలీ చేయడమే కాకుండా రోజువారీ విచారణ జరపాలని రఘురామ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై సుప్రీంలో అనేక సార్లు విచారణ జరిగింది. సీజేఐగా జస్టిస్ సంజీవ్ కన్నా నియమితులైన తర్వాత ఆయన బెంచ్ ముందు ఈ కేసు విచారణకు వచ్చింది. అయితే ఆయన బెంచ్‌లో మరో న్యాయమూర్తి అయిన సంజయ్ కుమార్ ఈ పిటిషన్‌ను నాట్ బిఫోర్ మీ అనడంతో వాయిదా పడింది. దీంతో ఈరోజు జస్టిస్ అభయ్ ఓకా నేతృత్వంలోని ధర్మాసనం ముందుకు విచారణకు వచ్చింది.

విచారణ సందర్భంగా సీబీఐ కోర్టు, హైకోర్టు, సుప్రీంకోర్టులో అనేక దశల్లో, అనేక పిటిషన్లు, ఎన్నో విచారణ జరుగుతుండటంతో గందరగోళ పరిస్థితి ఉందని, అసలు ఎక్కడెక్కడ ఏఏ పిటిషన్‌లు విచారణలో ఉన్నాయి, సీబీఐ కోర్టులో ఇప్పటి వరకు ఎందుకు విచారణ జరగడం లేదు? సీబీఐ కోర్టులో రోజువారీ విచారణ జరపాలని హైకోర్టు ఆదేశించినప్పటికీ ఎందుకు విచారణ జరగడం లేదని సుప్రీం ధర్మాసనం ప్రశ్నించింది.

డిశ్చార్జ్ పిటిషన్‌లకు సంబంధించిన విచారణ జరుగుతోందని, అందుకే అక్కడ రోజువారీ విచారణకు ఆటంకం కలుగుతోందని జగన్ తరపున న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఎన్ని డిశ్చార్జ్ పిటషన్‌లు వేశారు? ఎందుకు ఇంత జాప్యం జరుగుతోందని ధర్మాసనం మరో ప్రశ్న వేసింది. హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను ఎందుకు పాటించలేదని ప్రశ్నించడంతో పాటు సుప్రీంకోర్టులో జగన్ అక్రమాస్తులకు సంబంధించి పిటిషన్లు ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయని ప్రశ్నల వర్షం కురిపించింది. దీనిపై ఓ పట్టిక రూపంలో అఫిడవిట్‌లా ఇవ్వాలని, దాన్ని చూసిన తర్వాత నిర్ణయం తీసుకుంటామని ధర్మాసనం స్పష్టం చేసింది. హైకోర్టు చెప్పినప్పటికీ విచారణ జరగడం లేదంటే దీనిపై ఓ కచ్చితమైన నిర్ణయం తీసుకోవాల్సిందే అని సుప్రీంకోర్టు ధర్మాసనం అభిప్రాయ పడింది. అయితే ఈ కేసును జనవరికి వాయిదా వేయాలని జగన్ మోహన్ రెడ్డి తరపు న్యాయవాది కోరగా, అందుకు సుప్రీం నిరాకరిస్తూ డిసెంబర్ 13న విచారణ జరుపుతా మంటూ అభయ్ ఓకా నేతృత్వంలోని ధర్మాసనం వాయిదా వేసింది.

జగన్‌కు సంబంధించిన అక్రమాస్తులకు సంబంధించి అన్ని కోర్టుల్లో దాఖలైన పిటిషన్ల వివరాలు తెలుసుకున్న తరువాత సమగ్రమైన నిర్ణయం తీసుకుంటామని సుప్రీం కోర్టు ధర్మాసనం అభిప్రాయపడింది. కాగా జగన్ కేసును తేల్చాల్సిందేనన్న సుప్రీంకోర్టు ధర్మాసనం వ్యాఖ్యలపై న్యాయవర్గాల్లో ఆసక్తి వ్యక్తమవుతోంది.

# గ్రామ-వార్డు సచివాలయాల పునర్ వ్యవస్థీకరణపై ప్రభుత్వం ఫోకస్

**మొదటి పేజీ తరువాయి..**

ప్రజలకు మరింత చేరువై, ఏ విధంగా మెరుగైన సేవలు అందించాలనే దానిపైన ముఖ్యమంత్రి ప్రధానంగా చర్చించారు. సచివాలయ వ్యవస్థ పునర్ వ్యవస్థీకరణ ప్రధాన అజెండాగా జరిగిన మొదటి మీటింగ్ లో వ్యవస్థ పనితీరు, ప్రజలకు అందుతున్న సేవలపై అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు.

ఈ వ్యవస్థ ద్వారా అత్యుత్తమ ప్రజాసేవలు అందించడంతోపాటు సచివాలయ ఉద్యోగులకు కూడా ఒక క్రమబద్ధమైన ఉద్యోగ బాధ్యతలు కల్పించి ఈ వ్యవస్థను సమర్థవంతంగా ఉపయోగించుకునే అంశంపై చర్చించారు. మానవ వనరులను సక్రమంగా వినియో గించుకోవడంతో పాటు.... ఉద్యోగుల అవసరాలు, సౌకర్యాలపైనా చర్చించారు. సచివాలయ ఉద్యోగుల్లో కొందరికి ఎక్కువ పని, మరికొందరికి తక్కువ పని ఉండటం సరికాదని.. అందరికీ సమానమైన పని బాధ్యత ఉండేలా చూడాలనే ఆలోచనపై అభిప్రా యాలు తీసుకున్నారు. ప్రభుత్వ అవసరాలకు అనుగుణంగా ఉద్యోగుల సర్దుబాటు, శిక్షణ వారికి ఇవ్వాలని సమావేశంలో చర్చించారు.

### పంచాయతీలు ఎక్కువ - సచివాలయాలు తక్కువ

ప్రస్తుతం రాష్ట్రంలో గ్రామ పంచాయతీలు 13,291 ఉండగా గ్రామ సచివాలయాలు మాత్రం కేవలం 11,162 సచివాలయాలు మాత్రమే ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 15,004 గ్రామ-వార్డు సచివాలయాలు ఉండగా వీటిలో 1,19,803 మంది ఉద్యోగులను నేరుగా నియమించారు. ఇతర విభాగాల వారిని కూడా కలుపుకుంటే 1,27,175 మంది గ్రామ-వార్డు సచివాలయాల్లో ఉద్యోగులుగా ప్రస్తుతం పనిచేస్తున్నారు.

వీరిలో గ్రామ సచివాలయాల్లో 95,533 మంది, వార్డు సచివాలయాల్లో 31,592 మంది ఉన్నారు. వీరిలో 18 నుంచి 27 సంవత్సరాల వయసున్న ఉద్యోగులు 50,284 (39.54%) మంది, 28 నుంచి 37 సంవత్సరాల వయసున్న ఉద్యోగులు 54,774 (43.07%) మంది ఉన్నారు. సచివాలయ ఉద్యోగుల్లో పీజీ, పీహెచ్ డీ, ఇంజినీరింగ్, వైద్య విద్య చదివిన వాళ్లు ఉన్నారు. పీజీ, ఆపైన చదివిన ఉద్యోగులు 14 శాతం, వృత్తివిద్యా కోర్సులు చదివిన వాళ్లు 31 శాతం ఉన్నారు.

యువత అధికంగా ఉండే ఈ వ్యవస్థను ఏ విధంగా వినియో గించుకోవాలనే అంశంపై సమావేశంలో చర్చించారు. మొదటి సమావేశంలో వ్యవస్థ పనితీరుతో పాటు పలు అంశాలపై చర్చించారు. రానున్న రోజుల్లో మరింత కసరత్తు జరిపి ప్రభుత్వం ఈ విభాగంపై ముందడుగు వేయనుంది.

# ఈ పది నెలల్లోనే అద్భుతాలు జరుగుతాయా?

**మొదటి పేజీ తరువాయి..**

బాధ్యత మీదే అన్నారు. ఈ ప్రభుత్వం కష్టం మీద వచ్చిందని చెప్పడం లేదని, కానీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయించడం ద్వారా, మా తలరాతను మార్చి పెద్ద బాధ్యతలు ఇచ్చారని, కాబట్టి విషప్రచారాన్ని కూడా తిప్పికొట్టే బాధ్యత మీదే అన్నారు. నల్లచట్టాలు తెచ్చిన మోదీ, వరి వేస్తే ఉరి అన్న కేసీఆర్ ఇప్పుడు రైతుల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు.

### 213 అంబులెన్స్‌లు ప్రారంభం

ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా ఆరోగ్య ఉత్సవాలు నిర్వ హించారు. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ మార్గ్‌లో గల హెచ్‌ఎండీఏ మైదానంలో ఈ ఉత్సవాలు నిర్వహించారు. ప్రజాపాలన వేడుకల్లో



భాగంగా 213 అంబులెన్స్‌లను ప్రారంభించారు. 108, 102 వాహనాలను జెండా ఊపి ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ... తమ ప్రభుత్వం తొలి ప్రాధాన్యత విద్య, వైద్యం అన్నారు. తాము అధికారంలోకి వచ్చాక ఈ రెండింటిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఏడాదిలోపు తమ ప్రభుత్వం వైద్యశాఖలో 14 వేల ఉద్యోగాలను భర్తీ చేసిందన్నారు. వైద్య శాఖ బలోపేతమైతేనే ఆరోగ్య తెలంగాణ నిర్మాణమవుతుం దన్నారు. దేశంలో ఇంత పెద్ద ఎత్తున వైద్య శాఖలో ఎవరూ భర్తీ చేయలేదన్నారు. దేశంలోనే అత్యధిక డాక్టర్లను అందించే లక్ష్యంతో పని చేస్తున్నామన్నారు. తెలంగాణ సమాజమే తమ కుటుంబం అనుకొని తాము ఉద్యోగాలు ఇచ్చామన్నారు.

# డ్రోన్ స్టార్టప్‌లకు రూ.5 లక్షల ప్రోత్సాహకం!

### ఏపీ డ్రోన్ క్యాపిటల్‌గా అవతరించబోతోంది

### ఏపీ డ్రోన్ కార్పొరేషన్ సీఎండీ దినేష్ కుమార్ పిలుపు

**అమరావతి, మహానాడు:**

డ్రోన్ రంగంలో స్టార్టప్‌లు పెట్టడానికి ముందుకొచ్చే యువతకు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షల వరకు ప్రోత్సహకాలు ఇస్తుందని ఈ అవకాశాన్ని యువత అందిపుచ్చుకోవాలని ఏపీ డ్రోన్స్ కార్పొరేషన్ సీఎండీ కె. దినేష్ కుమార్ అన్నారు. సోమవారం విజయవాడలోని ధనేకుల ఇంజినీరింగ్ కళాశాలలో అడ్వాన్స్డ్ అటల్ ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామం ఆన్ ఏ డీప్ డైవ్ ఇన్‌టూ అటానమస్ వెహికల్ థియరీ టు ప్రాక్టీస్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పన్నెండు రోజుల పాటు జరిగే ఈ శిక్షణ కార్యక్రమం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. రాబోయే రోజుల్లో డ్రోన్ రంగం ఒక కీలక రంగంగా అభివృద్ధి చెందబతోందన్నారు. మన దేశానికి ఆంధ్రప్రదేశ్ ను డ్రోన్ క్యాపిటల్ గా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంకల్పించారు. ఆ దిశగా ఇప్పటికే డ్రోన్ రంగంలో ఏపీ ముందుకు వెళుతోందన్నారు. డ్రోన్ తయారీ, సేవల రంగంలో యువతకు, సాంకేతిక విద్యార్థులకు అపారమైన అవకాశాలున్నాయని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఎదురు చూస్తున్నాయని, యువత వాటిని అందిపుచ్చుకోవడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

డ్రోన్స్ తయారీ రంగంలో పరిశ్రమలు పెట్టడానికి ముందుకొచ్చే వారికి వారి 20 శాతం మేర రాయితీ ఇస్తున్నామని తెలిపారు. ఓర్వకల్లు వద్ద 300 ఎకరాల విస్తీర్ణంలో రాష్ట్ర ప్రభుత్వం ఒక డ్రోన్ హబ్‌ను ఏర్పాటు చేయబోతోందన్నారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా డ్రోన్ రంగంలో, డ్రోన్ల వినియోగంలో అనూహ్యమైన మార్పులు



వచ్చాయని, సాంకేతిక రోజూ కొత్త పుంతలు తొక్కుతూ ప్రజలకు సేవలు మరింత చేరువయ్యేలా చూడటంలో డ్రోన్లు కీలకపాత్ర పోషించబోతున్నాయన్నారు. దీంతో ఈ రంగంలో అవకాశాలు కూడా పుష్కలంగా లభించబోతున్నాయని తెలిపారు. సాంకేతిక విద్యా సంస్థలు కూడా డ్రోన్ రంగంలో వస్తున్న అత్యాధునిక సాంకేతిక పరిణామాల గురించి వివరించాలని కోరారు. ఈ దిశగా విద్యా ర్థులకు డ్రోన్లపైన తర్ఫీదు ఇవ్వడానికి ముందుకొచ్చే విద్యా సంస్థలకు కావాల్సిన సహకారం అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

ఐటీఐ, పాలిటెక్నిక్ లో డ్రోన్లకు సంబంధించి సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్సులు ఏర్పాటు చేస్తున్నామని, అలాగే డ్రోన్ల సాంతకేతిక వినియోగంపై నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు కూడా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వీటన్నిటినీ యువత, సాంకేతిక విద్యార్థులు, సాంకేతిక విద్యాసంస్థలు ఉపయోగించుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఐఐటీ గౌహతి సెంటర్ ఆఫ్ డ్రోన్ టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ ప్రదీప్, ధనేకుల ఇంజినీరింగ్ కళాశాల ఛైర్మన్ ధనేకుల రవీంద్రనాథ్ ఠాకూర్, కార్యదర్శి భవానీ ప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ రవి కడియాల తదితరులు పాల్గొన్నారు.

# బియ్యం బొక్కుతున్న ప్రతినిధులు

**మొదటి పేజీ తరువాయి..**

పోర్టుపై ఆయనదే పైచేయి. ఆయనకు తెలియకుండా పోర్టులో చీమకూడ చిటుక్కుమనదు. గతంలో ఆయన ఇంటిమనిషిగా



పేరుండి, వైసీపీలో చురుకుగా పనిచేసిన వ్యక్తి ఇప్పుడు జనసేన కోటాలో సివిల్‌సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ పదవి సాధించారంటే.. బియ్యం వ్యాపారంలో ద్వారంపూడి ఎంత శక్తివంతుడన్నది స్పష్టమవుతోంది. తాజాగా ఆయన కూటమికి చెందిన ప్రజాప్రతినిధులతో కలసి వ్యాపారం చేస్తున్నారని, గతంలో ఈ జిల్లా నుంచి మంత్రిగాపనిచేసిన ఓ నాయకుడితో కలసి వ్యాపారం చేశారన్న ప్రచారం తెలిసిందే.

కాగా బియ్యం రవాణాకు సంబంధించిన వాటాల వ్యవహారంలో.. కాకినాడ-రూరల్ నియోజకవర్గాల ప్రజాప్రతి నిధుల మధ్య పంచాయతీ జరుగుతున్నట్లు సమాచారం. ఇందులో తనకూ వాటా ఇవ్వాలంటూ.. రూరల్ నియోజకవర్గానికి చెందిన ఓ జనసేన అగ్రనేత పంచాయతీ పెట్టారని, తర్వాత ఈ విషయం తెలిసిన పవన్ కల్యాణ్.. సదరు నేతను మంద లించారన్న ప్రచారం జరుగుతోంది. ఇక కాకినాడకు చెందిన ఓ టీడీపీ కీలకనేతకు ముడుపులు ఇస్తే, ఎలాంటివాటినయినా అనుమతి ఇస్తారన్న ప్రచారం లేకపోలేదు.



జనం గుండె చప్పుడు

03

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || మంగళవారం 03, డిసెంబర్ 2024

## సింగిల్ బెంచ్ తీర్పుపై స్టే ఇచ్చేందుకు సీజే నో



- బెంచ్ నిరాకకరణ
- విజయ్ సాయి రెడ్డిపై విచారణ కేసు

హైదరాబాద్,మహానాడు:

వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అక్రమాస్తుల కేసు విచారణలో కీలక పరిణామం చోటు చేసుకుంది. తెలంగాణ హైకోర్టులో సోమవారం ఈ కేసులో A2 నిందితుడు ఎంపీ విజయ్ సాయి రెడ్డిపై వేసిన పిటిషన్‌పై విచారణ జరిగింది. ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంట్ ఆఫ్ ఇండియా ఇచ్చిన నోటీసులపై విచారణ చేసింది. వ్యక్తిగత దుష్ప్రవర్తనపై విజయ్ సాయి రెడ్డి విచారించాలని ఇప్పటికే ఐసీఏఐ నోటీసులు ఇచ్చింది. ఎంపీ విజయ్ సాయి రెడ్డికి ఇచ్చిన నోటీసులు రద్దు చేస్తూ గతంలో సింగిల్ బెంచ్ ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. విజయసాయి రెడ్డికి , కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. సింగిల్ బెంచ్ తీర్పుపై స్టే ఇవ్వాలని పిటిషనర్ తరపు న్యాయవాది ప్రసాద్ కోరారు.

సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పు పై స్టే ఇవ్వడానికి చీఫ్ జస్టిస్ బెంచ్ నిరాకరించింది. ఐసీఏఐ వాదనలపై కౌంటర్ దాఖలు చేస్తామని విజయ్ సాయి రెడ్డి తరుపు న్యాయవాది తెలిపారు. తదుపరి విచారణ రెండు వారాలకు వాయిదా వేసింది.

## కాంగ్రెస్ పాలనలో ప్రజలకు రక్షణ లేదు

- అరాచకం రాజ్యమేలుతుంది.
- అధికారులు ఒత్తిడులకు లోనుకాకుండా చట్టపరిధిలో పని చేయాలి
- కలెక్టరేట్‌లో ఆత్మహత్యకు ప్రయత్నించిన రైతును పరామర్శించిన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

హైదరాబాద్,మహానాడు:

ఎదుట్లకు చెందిన నరెడ్ల. సాయిరెడ్డి అనే వ్యక్తి ఈ పాలనలో నాకు న్యాయం జరగడం లేదని దాయాదులు తన భూమి ఆక్రమించి ఇబ్బందులకు గురిచేయడం వల్ల ఎన్నిసార్లు అధికారులకు మొరపెట్టుకున్నా తనకు న్యాయం జరగడం లేదని తీవ్ర ఆవేదన చెంది ప్రజావాణిలో కలెక్టర్ ఎదురుగా మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించడం జరిగింది.

ఇట్టి విషయం తెలుసుకున్న మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి హాస్పిటల్ కు వెళ్లి సాయి రెడ్డిని పరామర్శించి ధైర్యంగా ఉండాలని ఆత్మహత్య సమస్యకు పరిష్కారం కాదని ఓదార్చారు.వైద్యులను అతని ఆరోగ్య పరిస్తితి గురించి అడిగి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

ఈ సందర్భంగా మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో శాంతిభద్రతలు కరువైనాయని ఒకవైపు రైతు పండుగ సంబరాలు జరుగుతుంటే మరోవైపు రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అన్నారు. సాయిరెడ్డి న్యాయం కోసం పలుమార్లు పోలీసుల చుట్టూ తిరిగిన అధికార పార్టీ వారి ఒత్తిడులకు గురై పోలీసులు తనకు న్యాయం చేయకపోగా వేధించడం వల్ల,రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం చేయడం వల్ల భూమి పట్టా ఉన్నా సాగు చేయకుండా దాయాదులు దౌర్జన్యం చేయడం వల్ల విసిగి వేసారి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు అని ఇది దురదృష్టకరం అని అన్నారు.

అధికారులు అధికార పార్టీ ఆదేశాలు రాష్ట్రపతి హుకూం లాగా పనిచేస్తున్నారని సివిల్ పంచాయితీలలో పోలీసులు కలగజేసుకోవడం వంటి చర్యలకు పాల్పడకుండా చట్టపరిదిలో పనిచేయాలని అన్నారు.



జిల్లా మంత్రి కృష్ణారావు సొంత గ్రామములో వేలాది క్వింటాల ధాన్యం మాయమైతే దిక్కులేదని అదేవిధంగా లక్షిమిపల్లిలో శ్రీధర్ రెడ్డి హత్య జరిగితే నేటికీ దోషులను పట్టుకోలేదు కానీ సోషల్ మీడియాలో పోస్టులు పెడితే పోలీస్ స్టేషన్ కు పిలిపించి వేధించడం వంటి చర్యలకు మంత్రి చేస్తున్నారని ఇది ప్రజాస్వామ్యానికి మంచిది కాదని అన్నారు.

కాంగ్రెస్ పాలనలో ఊరి ఊరికి షాడో ఎం.ఎల్. ఎలు తయారై ప్రజలను వేధించడం వల్ల ఇటువంటి చర్యలు జరుగుతున్నాయని వెంటనే ప్రభుత్వం,అధికారులు స్పందించి సాయి రెడ్డికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ఆసుపత్రిలోని వార్డులో తిరిగి రోగుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

## రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం

- రేషన్ బియ్యం అక్రమ రవాణాను వ్యవస్థీకృత నేరంగా పరిగణించాలని నిర్ణయం
- కాకినాడ పోర్టులో అయిదు వేర్ హౌసుల్లో సార్టెక్స్ మిషన్లు ఏర్పాటుపై విచారణకు ఆదేశం
- రాష్ట్ర సచివాలయంలో మంత్రివర్గ ఉప సంఘం సమావేశం
- పోలీస్, రవాణా, సివిల్ సప్లైస్, మారిటైమ్ బోర్డు అధికారులతో సమీక్ష



అమరావతి,మహానాడు:

పేదల కోసం ఉద్దేశించిన బియ్యాన్ని అక్రమంగా రవాణా చేయడాన్ని వ్యవస్థీకృత నేరంగా పరిగణించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర సచివాలయంలో పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తో కూడిన మంత్రివర్గ ఉప సంఘం సోమవారం సమావేశమైంది. ఈ సమావేశంలో విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ డి.జి, శాంతిభద్రతల ఐ.జీ., సివిల్ సప్లైస్ ఎక్స్ అఫిషియో సెక్రెటరీ, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ఎం.డి., మారిటైమ్ బోర్డు సి.ఈ.ఓ., కస్టమ్స్ అధికారి, కాకినాడ పోర్టు అధికారులు, రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం అక్రమ రవాణా, కాకినాడ పోర్టులో వ్యవహారాలపై చర్చించారు. కాకినాడ పోర్టులో భద్రత వ్యవస్థను బలోపేతం చేయాలని, ఇందులో భాగంగా కాకినాడ పోర్టు భద్రత కోసం చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ ను నియమించాలని ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాను వ్యవస్థీకృత నేరంగా పరిగణిస్తున్నందున పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కాకినాడ పోర్టు, పరిసర ప్రాంతాల్లో రవాణా కార్యకలాపాలపై నిఘాను కట్టుదిట్టం చేయనున్నారు. కాకినాడ యాంకరేజ్ పోర్టులో బియ్యం ఎగుమతి చేస్తున్న స్టెల్లా నౌకపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. కాకినాడ పోర్టులోని అయిదు వేర్ హౌసుల్లో సార్టెక్స్ మిషన్లు ఉన్న అంశంపై చర్చించారు. వేర్ హౌసుల్లో యంత్రాలు ఏ విధంగా ఏర్పాటు చేశారని మారిటైమ్ బోర్డు, కాకినాడ పోర్టు అధికారులను మంత్రులు ప్రశ్నించారు. సార్టెక్స్ యంత్రాలను ఏర్పాటుపై విచారణ చేపట్టాలని, అందుకు బాధ్యులైనవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## నామినేటేడ్ పోస్టులపై కసరత్తు

- మరో 15 రోజుల్లో ప్రకటన?
- బాబు-పవన్ భేటీలో బియ్యం అక్రమ రవాణ అంశంపై చర్చ

అమరావతి,మహానాడు:

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సోమవారం అమరావతిలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వీరిద్దరి మధ్య పలు కీలక అంశాలు చర్చకు వచ్చాయి..

కాకినాడ పోర్ట్‌లో రేషన్ బియ్యం కట్టడికి తీసుకోవాల్సిన చర్యలపై వీరిద్దరు ప్రధానంగా చర్చించారు. దీనిపై త్వరలో ఓ సబ్ కమిటీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆలోచన చేస్తుంది. ఈ అంశంపై మంగళ వారం జరిగే కేబినెట్‌లో చర్చించే అవకాశమున్నట్లు తెలుస్తుంది.

అలాగే రాజధాని అమరావతిలో చేపట్టబోయే అభివృద్ధి పనులపై చంద్రబాబు, పవన్ కళ్యాణ్ చర్చించారు. డిసెంబర్ 15వ తేదీ నుంచి అమరావతి పనులను వేగవంతం చేయాలని ఈ సందర్భంగా వారు నిర్ణయించారు. అలాగే రాష్ట్రంలో తాజా రాజకీయ పరిణామాలతోపాటు, ఇటీవల ఢిల్లీ వేదికగా చోటు చేసుకున్న కీలక పరిణామాలపై వీరు చర్చించారు. అయితే సీఎం చంద్రబాబు నాయుడు సోదరుడు నారా రామ్మూర్తి నాయుడు ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఆయన మృతి పట్ల డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ విచారం వ్యక్తం చేశారు.

నామినేటెడ్ పోస్టుల విషయంలో త్వరలో నాలుగో జాబితా విడుదలపై కసరత్తు చేస్తున్నారు. అందులోభాగంగా పలువురి పేర్లు ప్రస్తావ-నకు వచ్చినట్లు సమాచారం. మూడు జాబితాల విషయంలో ఎటువంటి వివాదాలకు తావు లేకపోవడంతో, నాలుగు జాబితా సైతం కష్టపడి పని చేసిన వారికి పదవులు కేటాయించాలని వీరిద్దరు ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తుంది. మరో 15 రోజుల్లో నాలుగో జాబితా విడుదల చేసే అవకాశముంది.

కాకినాడ పోర్ట్ నుంచి ప్రజా పంపిణీ బియ్యం, స్మగ్లింగ్ అవుతున్న నౌకను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్వయంగా సీజ్ చేయించారు. ఈ



నేపథ్యంలో ఈ విషయం రాష్ట్రవ్యాప్తంగా సంచలనమైంది. ఈ అంశంపై వైసీపీ నేతలు పేర్ని నాని, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ ఆరోపణలు గుప్పించిన సంగతి తెలిసిందే. అయితే ఈ బియ్యం అక్రమ రవాణా విషయంపై సీఎం చంద్రబాబు సీరియస్ అయిన విషయం విధితమే. తాజాగా వీరి భేటీలో ఈ అంశాన్ని ప్రధానంగా చర్చించినట్లు సమాచారం.

ఇక ఈ ఏడాది మే, జూన్ మాసాల్లో అసెంబ్లీ, సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో బీజేపీ, జనసేన, టీడీపీ కలిసి కూటమిగా ఏర్పడి ఎన్నికలకు వెళ్లాయి. ఈ ఎన్నికల్లో సీట్ల సర్దుబాటులో భాగంగా ఈ మూడు పార్టీలకు చెందిన ఆశావహులు.. ఎన్నికల బరిలోకి దిగలేదు. ఈ నేపథ్యంలో వారికి నామినేటేడ్ పదవులు కేటాయిస్తామని.. ముందే పార్టీల అధినేతలు హామీ ఇచ్చారు. అందులోభాగంగా ఇప్పటికే మూడు జాబితాలను విడుదల చేసింది. నాలుగో జాబితా విడుదలకు రంగం సిద్ధం చేస్తుంది.ఆమేరకు 15 రోజుల్లో మరో జాబితాకు కూటమి కసరత్తు ప్రారంభించింది.

## దళిత బంధును ఆపిన దద్దమ్మ రేవంత్ రెడ్డి

- కాంగ్రెస్ నేతలు హుజురాబాద్ లో ఎలా తిరుగుతారో చూస్తాం
- హుజురాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

హైదరాబాద్,మహానాడు:

దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రం లో కేసీఆర్ దళిత బంధు పథకం తెచ్చారు. హుజురాబాద్ నియోజక వర్గం లో పైలట్ పద్దతిన ఈ ప్రాజెక్టు ప్రారంభించారు. కేసీఆర్ హాయం లో మొత్తం 18 500 మంది దళితులకు పది లక్షల రూపాయల చొప్పున వారి అకౌంట్లలో వేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 2 లక్షల మంది దళితులు దళితబంధు కింద ఎంపిక య్యారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే దళిత బంధు అకౌంట్లను ఫ్రీజ్ చేశారు. నేను అసెంబ్లీ లో ఈ అంశాన్ని గతం లోనే లేవనెత్తాను. ఏడాది పాలన పూర్తవుతున్నా దళిత బంధు లబ్దిదారులకు డబ్బు చేరలేదు. దళిత బంధు గొప్ప పథకం. దళిత బంధు పథకం తో వర్కర్లు గా పని చేసిన వారు యాజమానులు అయ్యారు.

నేనే దళిత బంధును ఆపానని కొందరు నాపై దుష్ప్రచారం చేస్తున్నారు. దళిత బంధు ను ఆపిన దద్దమ్మ రేవంత్ రెడ్డి. ఇందుకు ఎస్సీ కార్పొరేషన్ విడుదల చేసిన జీవో నే సాక్ష్యం. రేవంత్ దళిత ద్రోహి గా మిగిలి పోతున్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టో లో దళిత బంధు సాయాన్ని పన్నెండు లక్షలకు పెంచుతామన్నారు. పన్నెండు లక్షలు ఇవ్వకపోగా పది లక్షలనే ఆపుతున్నారు. దళిత బంధు డబ్బులు విడుదల చేయాలని లబ్ది దారులు ఇప్పటికే ఎనిమిది సార్లు జిల్లా కలెక్టర్ కు మంత్రులకు వినతి పత్రాలు ఇచ్చారు. వినతి పత్రాల పై వాళ్ళు స్పందించక పోగా కొందరిని నా ఇంటి దగ్గర ధర్నాకు ఉసి కోల్పుతున్నారు. నవంబర్ 8 న దళిత బంధు లబ్ది దారుల పక్షాన నేను ధర్నా చేస్తే కేసులు బుక్ చేస్తున్నారు. ఒకటే ధర్నా మీద రెండు ఎఫ్ ఐ ఆర్ లు నమోదు చేసి కేసులు పెడుతున్నారు.

పేద మహిళలపై అక్రమ కేసులు పెడుతున్నారు. దళిత బంధు ఇవ్వమని దళిత మహిళలు అడగడమే తప్పా? హుజురాబాద్ ఏసీపీ దారుణంగా ప్రవర్తిస్తున్నారు. మహిళలని చూడకుండా వారిని బూటు కాళ్లతో తన్నారు. కాంగ్రెస్ అధికారం శాశ్వతం కాదని ఏసీపీ గ్రహించాలి. ఏసీపీ చిట్టా అంతా త్వరలోనే బయట పెడతా.

కాంగ్రెస్ నాయకులను అడ్డుకుంటామని పిలుపునిస్తే రాకేష్ అనే యువకుడ్ని ఇష్టమొచ్చినట్టు కొట్టి అక్రమ కేసు బనాయించారు. ఇన్ని




రోజులు ఓపిక పట్టా ..ఇకపై సహించను. పోలీసు అధికారుల్లారా కాంగ్రెస్ పార్టీ మీకు జీతం ఇవ్వడం లేదు.జాగ్రత్తగా మెదలాలి. దళితుల ను పోలీస్ స్టేషన్ కు అనవసరంగా పిలిపిస్తే ఊరుకునేది లేదు. పోలీస్ స్టేషన్లను ముట్టడిస్తాం.

దళిత సోదరి ,సోదరులను వేధించడం న్యాయమా రేవంత్ రెడ్డి? దళిత బంధు పై దళిత సంఘాలు స్పందించాలి. దళిత బంధు అకౌంట్ల ను ఫ్రీజ్ చేయడం పై దళిత మేధావులు స్పందించాలి. కాంగ్రెస్ నేతలు హుజురాబాద్ లో ఎలా తిరుగుతారో చూస్తాం. దళితులకు బీ ఆర్ ఎస్ అండగా ఉంటుంది. నా ప్రాణం పోయినా సరే ..దళిత బంధు వచ్చేదాకా పోరాడతా.ఎవ్వరికీ భయపడేది లేదు. పోలీసుల లాఠీలకు బుల్లెట్ల కు భయపడేది లేదు. దళితులపై కేసులను బీ ఆర్ ఎస్ పార్టీ లీగల్ సెల్ న్యాయపరంగా ఎదుర్కుంటుంది.

## సీఎంకు మంత్రివర్గ విస్తరణ చేసే దమ్ము లేదు


- మంత్రికి సిగ్గు ఉండాలి
- గురుకులాల్లో విషాహారానికి బీ ఆర్ ఎస్ కుట్ర అనడానికి సిగ్గుండాలి
- ఏ శాఖకు పని లేదు ..పోలీసులకు తప్ప
- పిల్లలకు అన్నం కూడా సరిగా పెట్టలేని దద్దమ్మ ప్రభుత్వం
- కోదండరాం కైనా సీఎం విద్యా శాఖను కేటాయించాలి
- గురుకులాలను జైల్లుగా మారుస్తున్నారా?
- మాజీ మంత్రి జి .జగదీష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, బీఆర్ ఎస్ వి అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్

హైదరాబాద్,మహానాడు:

ఏడాది కాలంలో రేవంత్ ప్రభుత్వ సత్తా ఏమిటో తెలిసిపోయింది. కేవలం పోలీసులతో పాలన చేస్తున్నారు. కేసీఆర్ ను రావాలి రావాలి అని అడుగుతున్నారు .ఏదో సాధించినట్టుగా. గురుకులాల్లో స్థితిగతులను అధ్యయనం చేయడానికి వెళితే విద్యార్థి సంఘాలను అడ్డుకుంటున్నారు.

కేసీఆర్ హాయంలో ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ నేతృత్వంలో గురుకులాలు అద్భుతంగ తీర్చిదిద్దబడితే రేవంత్ ప్రభుత్వం వాటిని నాశనం చేస్తోంది. కేసీఆర్ హయంలో గురుకుల విద్యార్థులు ఎవరెస్టు తో పాటు కిలిమంజారో పర్వతం అధిరోహించారు. గురుకులాల్లో అధ్వాన్నంగా ఉన్న పరిస్థితులను అధ్యయనం చేయడానికి ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ నేతృత్వం లో కమిటీ వేశాం. మా విద్యార్థి విభాగం గురుకులాల్లో సమస్యలు అధ్యయనం చేస్తే రేవంత్ రెడ్డి కి వచ్చిన ఇబ్బంది ఏమిటీ ? అసెంబ్లీ సమావేశాలున్న నేపథ్యం లో ప్రభుత్వానికి సూచనలు ఇవ్వడానికే మా బృందాలు పర్యటిస్తున్నాయి. గురుకులాల్లో అన్నీ బాగుంటే రేవంత్ ఈ పర్యటనలు ఎందుకు అడ్డుకుంటున్నారు?

విద్యార్థులను కలిసేందుకు మా వాళ్ళను రేవంత్ రెడ్డి ఆపుతున్నారు. విద్యార్థులే రోడ్ల మీదకు వస్తున్నారు. ఎంత మందిని అడ్డుకుంటావు ? మేము అక్కడికి ధర్నాలు చేయడానికో తరగతుల బహిష్కరణకో వెళ్లడం లేదు. లగచర్ల కు వెళతామంటే అనుమతి ఇవ్వరు. మహబూబా బాద్ లో మా మీటింగ్ కు అనుమతివ్వరు. ఎన్నిరోజులు ఈ నిర్బంధాలు ,ఎంత కాలం ఈ మోసాలు? స్కూలు పిల్లలకు అన్నం కూడా సరిగా పెట్టలేని దద్దమ్మ ప్రభుత్వం ఇది. రైతు రుణమాఫీ పది కోట్ల రూపాయల మేర కూడా కాలేదు. ఎవరొస్తారో రండి చర్చకు. వడ్ల కొనుగోలు పై ఇప్పటికీ లెక్కలు చెప్పడం లేదు.రైతు భరోసా కన్నా బోనస్ బాగుందని చెప్పడానికి మంత్రికి సిగ్గు ఉండాలి. ఏ శాఖ కు పని లేదు ..పోలీసులకు తప్ప!దోచుకుని ఢిల్లీకి మూటలు పంపడం తప్ప ఈ ప్రభుత్వానికి ఏదీ



చేతకావడం లేదు. ఏం చేశారని సంబురాలు చేసుకుంటున్నారు? ఢిల్లీ బానిసలకు అధికారం అప్పజెప్పొద్దని కేసీఆర్ మొత్తుకున్నారు.

ఏడాది లో సీఎం 30 సార్లు ఢిల్లీ వెళ్లారు ?ఏం సాధించారు ? సోషల్ మీడియా లో పోస్టులు పెడితే కేసులు పెడుతున్నారు. మా విద్యార్థి విభాగం నాయకుల గురుకులాల సందర్శనను పోలీసులు అడ్డుకోవద్దని మనవి. బూటకపు ఎన్ కౌంటర్లు ఎక్కడా జరిగినా తప్పే. కేసీఆర్ హాయం లో ఒకఎన్‌కౌంటర్ జరిగితే పోలీసు ఉన్నతాధికారులకు క్లాస్ తీసుకున్నారు. ఆ తర్వాత తొమ్మిదిన్నరేళ్ళ కేసీఆర్ పాలన లో ఒక్క ఎంకౌంటర్ జరగలేదు. రేవంత్ పాలనలో జరిగిన ఎన్ కౌంటర్ లో14 మంది చనిపోయారు. ఏ ఎన్ కౌంటర్ పై నైనా ఆరోపణలు వస్తే కచ్చితంగా విచారణకు ఆదేశించాలి. ప్రభుత్వాన్ని నడిపేది బీ ఆర్ ఎస్ యే అయినట్టు ..కాంగ్రెస్ నేతలు ప్రతి అంశం లో మా కుట్ర ఉందని ఆరోపిస్తున్నారు. గురుకులాల్లో విషాహారానికి బీ ఆర్ ఎస్ కుట్ర అనడానికి సిగ్గుండాలి. పాలన చేత కాకనే బీ ఆర్ ఎస్ పై నిస్సిగ్గుగా విమర్శలు చేస్తున్నారు. వివిధ శాఖలకు మంత్రులు లేకపోవడం కూడా ప్రభుత్వ వైఫల్యాలకు ప్రధాన కారణం. విద్యా శాఖకు మంత్రి లేకపోవడం ఏమిటీ ? విద్యా శాఖ కీలకమైందన్న సోయి ఈ ప్రభుత్వానికి లేదు. రేవంత్ రెడ్డి కి దేనిపై పట్టింపు లేదు.వేరే విషయాలపై ఆయనకు శ్రద్ధ ఉంది. విద్యా శాఖ మంత్రిగా ముఖ్యమంత్రే ఉండటం దుర్మార్గం.

సీఎంకు మంత్రివర్గ విస్తరణ చేసే దమ్ము లేదు ..కనీసం వేరే మంత్రులకు విద్యా శాఖ అప్పగించాలన్న ఇంగితం సీఎంకు లేదు. ప్రజలు కేంద్రం గా రేవంత్ ప్రభుత్వం పని చేయడం లేదు. తనకిష్టమైతే తప్ప మంత్రులను సీఎం కలవడం లేదు. ఇక అధికారులను ఏం కలుస్తారు ? కనీసం కోదండరాం కైనా సీఎం విద్యా శాఖను కేటాయించాలి. తన శత్రువులుగా ఉన్న మంత్రులకైనా ఇవ్వాలి.

ఇప్పటికైనా సీఎం రేవంత్ సోయి తెచ్చుకుని పాలన చేయాలి. గురుకులాల్లోని విద్యార్థుల తల్లి దండ్రులు తమ బిడ్డల భవిష్యత్ పై ఆందోళనగా ఉన్నారు. ఆదివారం నాడు తమ పిల్లలను గురుకులాల్లో కలిసేందుకు తల్లిదండ్రులకు అనుమతివ్వరా? గురుకులాలను జైల్లుగా మారుస్తున్నారా?

## సజ్జలకు సుప్రీంలో చుక్కెదురు

- తనపై ఇక కేసులు నమోదుచేయకుండా ఆదేశాలివ్వాలని సుప్రీంలో సజ్జల భార్గవరెడ్డి పిటిషన్
- కుదరదన్న సుప్రీంకోర్టు
- హైకోర్టులోనే వాదనలు వినిపించుకోవాలని ఆదేశం
- భార్గవ్ రెడ్డి పోస్టులు బ్యాడ్ టేస్ట్
- రెండువారాలపాటు సజ్జలను అరెస్టు చేయవద్దన్న ఊరట

న్యూఢిల్లీ,మహానాడు:

ప్రభుత్వ మాజీ సలహాదారు సజ్జల రామకృష్ణా రెడ్డి కుమారుడు, వైఎస్ఆర్సీపీ సోషల్ మీడియా ఇంఛార్జి, సజ్జల భార్గవరెడ్డికి సుప్రీం కోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. సోషల్ మీడియా పోస్టులపై ఏపీ ప్రభుత్వం తనపై దాఖలు చేసిన కేసులను కొట్టివేయాలని సుప్రీంను సజ్జల ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై సుప్రీంలో విచారణకు వచ్చింది.

ఇకతనపై కేసులు నమోదు చేయకుండా ఆదేశాలు ఇవ్వాలంటూ సజ్జల భార్గవరెడ్డి దాఖలు చేసిన పిటీషన్‌ను, సుప్రీంకోర్టు ధర్మాసనం తిరస్కరించింది. సజ్జల వాదనలను ఏపీ హైకోర్టులో వినిపించాలని అక్కడే పిటీషన్‌లు దాఖలు చేయాలని సూచించింది.

ఏపీ హైకోర్టును ఆశ్రయించేంత వరకూ రెండు వారాల పాటు సజ్జలను అరెస్ట్ చేయకూడదని సుప్రీం మధ్యంతర రక్షణ కల్పించింది. రెండు వారాల తరువాత మధ్యంతర రక్షణను పొడిగించాలా? లేదా? అన్నది హైకోర్టు నిర్ణయం తీసుకుంటుందని వెల్లడించింది.

టీడీపీ నేతలపై సజ్జల భార్గవరెడ్డి సోషల్ మీడియాలో పెట్టిన పోస్టులను సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూత్రా, ధర్మాసనం దృష్టిని తీసుకొచ్చారు. వాటిని పరిశీలించిన ధర్మాసనం తీవ్ర వ్యాఖ్యలు చేసింది. సజ్జల భార్గవరెడ్డి సోషల్ మీడియా పోస్టులన్నీ ఆమోదయోగంగా లే వు. సీరియస్‌గా ఉన్నాయి. బ్యాడ్ టేస్ట్ అని ధర్మాసనం అభిప్రాయపడింది. అనంతరం సజ్జల భార్గవరెడ్డి పిటీషన్‌పై సుప్రీం ధర్మాసనం విచారణను ముగించింది. తనపై నమోదైన అన్ని ఎఫ్ఐఆర్‌లు కొట్టి వేయాలని సజ్జల భార్గవ రెడ్డి దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై విచారణకు జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం నిరాకరించింది. గతంలో జరిగిన



వ్యవహారాలకు కొత్త చట్టాల ప్రకారం కేసులు నమోదు చేస్తున్నారని సజ్జల తరపు న్యాయవాది కపిల్ సిబల్ వాదించారు.

చట్టాలు ఎప్పటివి అన్నది ముఖ్యం కాదని, మహిళలు, ప్రజా ప్రతినిధులు అని కూడా చూడకుండా చేసిన అసభ్య వ్యాఖ్యలు చూడాలని ప్రభుత్వం తరపు న్యాయవాది సిద్దార్థ లూత్రా కోరారు. సామాజిక మాధ్యమాల్లో ఇతరులపై దుమ్మెత్తి పోస్తూ, అసభ్య పదజాలం ఉపయోగించే వ్యవహారంలో కీలక సూత్రధారి భార్గవ రెడ్డి అని సుప్రీంకు ప్రభుత్వం తెలిపింది.

టీడీపీ నేతలపై సోషల్ మీడియాలో పెట్టిన పోస్టులను సిద్ధార్థ లూత్రా.. ధర్మాసనం దృష్టిని తీసుకొచ్చారు. ప్రస్తుత దర్యాప్తునకు కూడా సహకరించడం లేదని వెల్లడించారు. చాలా విషయాలు సుప్రీంకోర్టు ముందు కూడా గోప్యంగా ఉంచారని లూత్రా తెలిపారు. అలాగే సామాజిక మాధ్యమాల్లో పెట్టిన పోస్టుల వివరాలను కోర్టుకు ప్రభుత్వం అందించింది.

వాటిని పరిశీలించి ధర్మాసనం తీవ్ర వ్యాఖ్యలు చేసింది. సోషల్ మీడియా పోస్టులన్నీ ఆమోదయోగ్యంగా లేవని, చాలా తీవ్రంగా ఉన్నాయని, బ్యాడ్ టేస్ట్ అని జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యలు చేశారు. దుర్భాషలు, అభ్యంతరకరమైన భాష ఉపయోగించే ఎవరైనా చట్టపరమైన పరిణామాలు ఎదుర్కోవాల్సిందే అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

తాము ఇప్పుడు కేసు పూర్వాపరాల్లోకి వెళ్లడం లేదని, ఏ విషయాలు అయినా, హైకోర్టులోనే చెప్పుకోవాలని తెలిపింది. రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించేందుకు ధర్మాసనం రెండు వారాల సమయం ఇచ్చింది. ఇరు పక్షాల వాదనలు విని తగిన నిర్ణయం తీసుకునే స్వేచ్ఛ హైకోర్టుకు ఉందని ధర్మాసనం పేర్కొంది.



**నందిగామ:** కార్తీక మాసం గౌరీ పాడ్యమిని పురస్కరించుకొని నందిగామ మండలం పల్లగిరి కొండపై స్వయంభు శివాలయం మరియు కంచికచర్ల మండలం మున్నలూరు గ్రామం శివాలయం మరియు రామాలయంలో భక్తులు, గ్రామస్తులు కూటమినేతలతో కలిసి పాడ్యమి భోజనాలలో పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ విప్, శాసనసభ్యులు తంగిరాల సౌమ్య

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ ‖ మంగళవారం 03, డిసెంబర్ 2024 ‖



## తెలంగాణ భవన్ అంటే గుర్తుకొచ్చే పేరు శ్రీనివాస్ రెడ్డి

- రావుల భవన్‌కి దొరకడం అదృష్టంగా భావిస్తున్నాం
- తెలంగాణ భవన్‌లో మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్ రెడ్డికి చేసిన ఆత్మీయ సన్మానంలో మాజీ మంత్రి హరీష్ రావు




**హైదరాబాద్,మహానాడు:**

తెలంగాణ అంటే అందరికీ గుర్తుకు వచ్చే పేరు కేసీఆర్. బి ఆర్ ఎస్ అంటే అందరికీ గుర్తుకొచ్చే పేరు కేసీఆర్.తెలంగాణ భవన్ అంటే అందరికీ గుర్తుకొచ్చే పేరు శ్రీనివాస్ రెడ్డి.జలదృశ్యం టు తెలంగాణ భవన్. కేసీఆర్ పార్టీ పెట్టిన మూడవ రోజు శ్రీనివాస్ రెడ్డి, అయిన సోదరుడు రాంమోహన్ రెడ్డి వచ్చారు.పార్టీ పెట్టిన మూడవ రోజు నుంచి ఇప్పటి వరకు ఆయన ఎంతో సేవ చేశారు.25 ఏండ్ల నుంచి చూస్తున్నాను అయనలో ఎప్పుడు కోపం చూడలేదు.



1969 లో వెటర్నరీ కాలేజీ అధ్యక్షుడుగా పని చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడాలని బలంగా ఆయనలో ఉంది కాబట్టి బి ఆర్ ఎస్‌లో పని చేశారు. కేసీఆర్ చెప్పింది తు. చ తప్పక అమలు పర్చారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడడం కోసం కేసీఆర్ ఎంతో కష్టపడ్డారు, ఆ కష్టాన్ని కల్లారా శ్రీనివాస్ రెడ్డి చూశారు. కేసీఆర్ పోరాటాన్ని, త్యాగాన్ని, విజయాలను, కామన్ మినిమం ప్రోగ్రాములో పెట్టడం, ఇలా ఎన్నో విషయాలను ఆయన చూశారు. 2001 పార్టీ పెట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు అనుభవాలతో ఒక పుస్తకం కోరుకుంటున్నాం. పుస్తకాన్ని ఇక్కడ ఆవిష్కరిద్దామా, ఆమెరికాలో ఆవిష్కరిద్దామా అనేది నిర్ణయించుకుందాం. లోకల్ బాడీ ఎలక్షన్స్ అప్పుడు శ్రీనివాస్ రెడ్డి తయారు చేసిన బిఫామ్‌ల మీద కెసిఆర్ సంతకం పెట్టె వారు.

శ్రీనివాస్ రెడ్డి వెళ్లిపోతుంటే కేసీఆర్ చాలా బాధపడ్డారు. కేసీఆర్ సన్మానం చేయమని చెప్పారు. ఇది శ్రీనివాస్ రెడ్డికి సన్మానం కాదు పార్టీ కార్యకర్తలు అందరికి సన్మానం. శ్రీనివాస్ రెడ్డి ఖచ్చితంగా పుస్తకం రాయాలి. రావుల చంద్రశేఖర్ రెడ్డి భవన్ కి దొరకడం అదృష్టంగా భావిస్తున్నాం. కరోనా టైం లో కూడా ప్రతి రోజు తెలంగాణ భవన్ కి వచ్చారు. పార్టీ పెట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు జనరల్ సెక్రటరీగా ఉన్నారు.


## పోచారం నారాయణ కళాశాల ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

- యాజమాన్యం వేధింపులే కారణమా?
- ప్రిన్సిపాల్‌పై ఆందోళనకారుల దాడి
- గేట్లు తోసుకుని మరీ కాలేజీలోకి వెళ్లిన గ్రామస్తులు

**పోచారం,మహానాడు:**

నగర శివారులో యాజమాన్యం వేధింపులతో మరో ఇంటర్ విద్యార్థి బలయ్యాడు. పోచారం మున్సిపాలిటీ పరిధి అన్నోజిగూడ లోని నారా యణ కళాశాలలో సోమవారం ఇంటర్ విద్యార్థి ఉరివేసుకొని ఆత్మ హత్యకు పాల్పడ్డాడు. కళాశాల సమీపంలోని ఓ ప్రైవేటు నర్సింగ్ హెూమ్ తరలించగా విద్యార్థి అప్పటికే మృతి చెందాడని చెప్పడంతో, విషయం వెలుగులోకి రాకుండా యాజమాన్యం చాకచక్యంగా విద్యార్థి మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించినట్లు తెలుస్తోంది.

వివరాల్లోకి వెళితే ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ చదువుతున్న భానోత్ తనుష్ నాయక్ (16) అలియాస్ టింకు సోమవారం సాయంత్రం 4.30 గంటల ప్రాంతంలో బాత్రూంకని వెళ్లి బయటికి రావడం ఆలస్యం కావడంతో తోటి విద్యార్థులు గమనించి వెళ్లి చూడగా టింకు ఉరివేసుకొని ఉన్నట్లు సమాచారం. విషయం తెలుసుకున్న యాజమాన్యం హుటా




హుటిన విద్యార్థిని సమీప ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

అప్పటికే విద్యార్థి మృతి చెందాడని తెలియడంతో విద్యార్థి బంధు వులకు, తల్లిదండ్రులకు సమాచారం అందించారు. విద్యార్థి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. అయితే యాజమాన్యం వేధింపుల కారణంగానే తమ కుమారుడు చనిపోయాడని తల్లిదండ్రులు బంధువులు ఆరోపిస్తున్నారు. కళాశాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయించారు.

## వర్మకు స్వల్ప ఊరట

- 9 వరకూ అరెస్టు చేయవద్దని హైకోర్టు ఆదేశం

**అమరావతి,మహానాడు:**

అరెస్టుల నుంచి తప్పించుకుంటూ అజ్ఞాతంలోనే ఉంటూ వీడియోలు విడుదల చేస్తున్న వివాదాస్పద దర్శకుడు రాంగోపాల్‌వర్మకు హైకోర్టు స్వల్ప ఊరటనిచ్చింది. ఆయనను 9 వ తేదీవరకూ అరెస్టు చేయవద్దని పోలీసులను ఆదేశించింది.

చంద్రబాబు, పవన్ కల్యాణ్, నారా లోకేశ్ ఫొటోలను మార్ఫింగ్ చేసిన కేసులకు సంబంధించి సినీ దర్శకుడు రామ్ గోపాల్ వర్మకు హైకోర్టులో స్వల్ప ఊరట లభించింది. తనపై నమోదైన కేసులను క్వాష్ చేయాలంటూ ఆయన పెట్టుకున్న పిటిషన్‌ను ఈరోజు హైకోర్టు విచారించింది. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను అందించాలని పోలీసులను ఆదేశించింది. తదుపరి విచారణ 9వ తేదీ వాయిదా వేసింది. 9వ తేదీ వరకు వర్మపై ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులను ఆదేశించింది.

## రేవంత్.. తెలంగాణ ఉద్యమంలో నీ పాత్ర ఏంటి?

- జై తెలంగాణ అని ఏనాడైనా ఉద్యమించినవా?
- తెలంగాణ ఉద్యమకారులపై దాడి చేసింది రేవంత్ రెడ్డి
- రేవంత్ లక్కీ లాటరీతో ముఖ్యమంత్రి అయిండు
- బిజెపి తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు

**హైదరాబాద్,మహానాడు:**

తెలంగాణ రాష్ట్ర రాజకీయాలు కాంగ్రెస్ పార్టీ కాం ణంగా విపరీత పోకడలకు దారి తీస్తున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ తో పాటు పీసీసీ చీఫ్, మంత్రులు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నరు. డిసెంబరు 7తో కాంగ్రెస్ ఏడాది పాలన పూర్తికావొస్తుంది. అయితే, ప్రజలకు ఏమీ చేయలేదనే అసహనం వారినుంచి బయటపడుతోంది.అసలు తెలంగాణ రాష్ట్రంలో ప్రజలకు ఏం ఒరగబెట్టారని సంవత్సర పరిపాలన సంబురాలు చేసుకుంటున్నట్లు...?

రేవంత్... అసలు తెలంగాణ ఉద్యమంలో నీ పాత్ర ఏంటి..? జై తెలంగాణ అని ఏనాడైనా ఉద్యమించినవా? తెలంగాణ ఉద్యమకారులపై దాడి చేసింది రేవంత్ రెడ్డి. ఉద్యమకారులపై, ప్రజలపై తుపాకీ ఎక్కుపెట్టింది నువ్వు. తెలంగాణ ఉద్యమ సమయంలో రేవంత్ రెడ్డిని సమాజం ఛీ కొట్టింది.రేవంత్ రెడ్డికి తెలంగాణ ప్రజల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదు.రేవంత్ లక్కీ లాటరీతో ముఖ్యమంత్రి అయిండు.

కిషన్ రెడ్డి తెలంగాణ ఉద్యమంలో యాత్రలు, పోరాటాలతో ప్రజలను చైతన్యవంతం చేశారు. అనేకసార్లు అరెస్టయ్యారు. రేవంత్.. దీనిపై దమ్ముంటే చర్చకు రావాలి. తెలంగాణకు మోదీ ఏం చేశారంటూ గతంలో కేసీఆర్ కూడా ఇట్లనే మాట్లాడిండు. ఆఖరుకు ఫాంహౌస్ కు పరిమితమయ్యిండు. రేవంత్ రెడ్డికి కూడా కేసీఆర్ కు పట్టిన



గతే పట్టే రోజులు దగ్గరపడ్డాయి.

ఆర్టీసీ కళ్యాణమండపం సాక్షిగా, జర్నలిస్టుల సాక్షిగా తెలంగాణకు, హైదరాబాద్ కు, సికింద్రాబాద్ కు కేంద్రం ఇచ్చిన లక్షల కోట్ల నిధుల గురించి అన్ని వివరాలతో కిషన్ రెడ్డి బహిరంగంగా వివరించిన్రు.రేవంత్ రెడ్డి.. మరోసారి తెలంగాణకు కేంద్రం ఇచ్చిన నిధుల గురించి అమరవీరుల స్థూపం దగ్గర చర్చకు సిద్ధమా..? ఇంకెక్కడైనా చర్చించేం దుకు మేం సిద్ధంగా ఉన్నాం.

ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రంలో సంపూర్ణంగా రైతు రుణమాఫీ చేసిన చరిత్ర బిజెపిది.ఇటీవల వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రూ. 13 వేల కోట్లు ఇస్తే మొత్తం రుణమాఫీ పూర్తవుతుందని చెబితే... నిన్న పాలమూరు సాక్షిగా రూ. 3 వేల కోట్లతో రుణమాఫీ పూర్తయిందంటూ సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. మొత్తంగా అబద్ధాల ప్రచారంతో ప్రజలను మాయ చేయాలని మరోసారి ప్రయత్నం చేస్తున్నారు.

2024 మార్చి 31 వరకు 64 లక్షల 90 వేల 228 మంది షార్ట్ టర్మ్ క్రాప్ లోన్స్ తీసుకున్నారు. రైతు రుణమాఫీకి మొత్తం రూ. 79 వేల 387 కోట్లు ఇవ్వాల్సి ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 22 వేల కోట్ల రూపా యలు ఇచ్చి, మొత్తం రుణమాఫీ చేసినట్లుగా ప్రచారం చేసుకుంటున్నది. రేవంత్ రెడ్డి ఒట్టు అంటే.. ప్రజలు తిట్టు అన్నట్లుగా భావిస్తున్నారు.

మొత్తం 41 సార్లు వివిధ రాష్ట్రాల ప్రభుత్వాలను రద్దు చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీది. రాజ్యాంగంలో 90 సవరణలు కాంగ్రెస్ హయాంలో జరిగినవే.కోర్టులను ప్రశ్నించడం,.. పార్లమెంటును ప్రశ్నించడం.. ఎలక్షన్ కమిషన్ ను, సీబీఐని, ఇన్ కమ్ ట్యాక్స్ డిపార్ట్ మెంట్ ను తప్పుబట్టే నీచమైన చరిత్ర కాంగ్రెస్ పార్టీది.

ల్యాండ్స్ గురించి, గుజరాత్ మద్యం బ్రాండ్ల గురించి మాట్లాడే రేవంత్ రెడ్డికి.. రియల్ ఎస్టేట్ బినామీ భూముల విషయంలో ఆఫీసర్లకు ఏయే బ్రాండ్లు ఇవ్వాలో బాగా తెల్సు. గుజరాత్‌లో మద్య నిషేధం ఉందా అని అడుగుతున్న రేవంత్ రెడ్డికి.. తెలంగాణలో డ్రగ్స్ నిషేధం ఉందని తెలుసా? రేవంత్‌కు.... స్మగ్లింగ్ కు, నిషేధానికి, అధికారి కంగా అమ్మకాలు జరపడానికి మధ్య తేడా తెలియకుండా ఇష్టానుసారంగా మాట్లాడుతున్నడు. ఇప్పటికైనా బిజెపి పట్ల, బిజెపి నాయకులపై మాట్లాడే ముందు రేవంత్ రెడ్డి నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరిస్తున్నాం.

## కేసీఆర్ మొక్క కాదు... వేగు చుక్క

- కేసీఆర్‌ను సీఎం మొక్క అనడం హాస్యాస్పదం
- రేవంత్ రెడ్డి గురువులకే చుక్కలు చూపించి తెలంగాణ తెచ్చిన శక్తి కేసీఆర్
- కేసులతో బీఆర్ఎస్ కార్యకర్తలను వేధిస్తే ఊరుకోబోము
- కోరుట్ల బీఆర్ఎస్ కార్యకర్తలతో ఎమ్మెల్సీ కవిత భేటీ
- మోదీ ప్రభుత్వం చేనేతపై జీఎస్టీ విధించడం దౌర్భాగ్యం
- తెలంగాణ అధికారంలోకి వస్తే చేనేతపై జీఎస్టీని రియింబర్స్ చేస్తామన్న రాహుల్ గాంధీ హామీ ఏమైంది ?
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
- ఎమ్మెల్సీ కవితను కలిసిన అఖిల భారత పద్మశాలి సంఘం నాయకులు



**హైదరాబాద్,మహానాడు:**

బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలపై కక్షగట్టి రాష్ట్ర ప్రభుత్వం కేసులు పెడుతోందని, కార్యకర్తలను వేధిస్తే ఊరుకోబోమని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. కేసులకు వ్యతిరేకంగా కొట్లాడడానికి పార్టీ పరంగా లీగల్ టీమ్ ను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. సామాజిక మాధ్యమాల్లో నిజాలను ప్రచారం చేసినా, ప్రభుత్వ తప్పిదాలను ఎత్తిచూపినా కాంగ్రెస్ ప్రభుత్వం సహించడం లేదని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ నాయకులు ఎన్ని విమర్శలు చేసినా ఈ రకంగా వ్యవహరించ లేదని గుర్తు చేశారు.

కోరుట్ల నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులతో తన నివాసంలో ఎమ్మెల్సీ కవిత భేటీ అయ్యారు. జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, కోరుట్ల ఎమ్మెల్సీ డాక్టర్ సంజయ్, తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ... ముఖ్యమంత్రి, మంత్రులు అదే పనిగా పోటీపడి తిట్లు తిడుతున్నారని, కేసీఆర్ పాలనలో నిధులు వరద లయ్యి పారేవి... ఇప్పుడు రాష్ట్రంలో తిట్లు పారుతు న్నాయని అన్నారు. "కేసీఆర్ మొక్క అని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించడం హాస్యాస్పదం. కేసీఆర్ మొక్క కాదు పీకేయడానికి కేసీఆర్ ఒక వేగుచుక్క. రేవంత్ రెడ్డి గురువులకే చుక్కలు చూపించి తెలంగాణ సాధించిన శక్తి కేసీఆర్."

తెలంగాణ ఉద్యమ కాలం నుంచీ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు ఎన్నో కష్టాలకోర్చి పనిచేసిన చరిత్ర అని, ఎన్ని ఇబ్బందులు వచ్చినా బీఆర్ఎస్ పార్టీ తట్టుకొని నిలబడిందని స్పష్టం చేశారు.

ఇప్పుడు కూడా అదే స్పూర్తిగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. కష్టకాలంలో పార్టీ కోసం పని చేసే వారే నిజమైన కార్యకర్తలని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలని కార్యకర్తలకు ఎమ్మెల్సీ పిలుపుని చ్చారు. ప్రభుత్వ వైఫల్యాలను, హామీలను విస్మరించిన తీరును ప్రజల్లో ఎండగట్టాలని దిశానిర్దేశం చేశారు.

### మోదీ ప్రభుత్వం చేనేతపై జీఎస్టీ విధించడం దౌర్భాగ్యం

బ్రిటీష్ పాలనలో కూడా లేని చేనేతపై పన్నును ప్రధాని మోదీ జీఎస్టీని విధించడం దౌర్భాగ్యమని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు.

సోమవారం నాడు అఖిల భారత పద్మశాలి సంఘం నాయకులు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత తన నివాసంలో కలిశారు. కుల గణనపై బీసీ డెడికేటెడ్ కమిషన్‌కు నివేదిక అందించి నందుకు ఎమ్మెల్సీ కవితకు ధన్యవాదాలు తెలియ జేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాటా డుతూ.. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాష్ట్ర ప్రభుత్వ తరపున చేనేతపై జీఎస్టీని రీయింబర్స్ చేస్తామని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కానీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక హామీని విస్మరించడం శోచనీయమని విమర్శించారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం చేనేతపై కేంద్రం విధిస్తున్న జీఎస్టీని రియింబర్స్ చేయాలని డిమాండ్ చేశారు.

అఖిల భారత పద్మశాలి సంఘ జాతీయ అధ్య క్షులు కందగట్ల స్వామి, అఖిలభారత పద్మశాలి సంఘం రాజకీయ జాతీయ అధ్యక్షుడు బొల్లా శివ శంకర్, తెలంగాణ పద్మశాలి సంఘ మహిళా అధ్యక్షురాలు గుంటక రూపక, తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం ఉపాధ్యక్షుడు గుర్రం శ్రవణ్, తెలంగాణ పద్మశాన సంఘ రాజకీయ విబాగా ప్రధాన కార్యదర్శి కు బొమ్మ ప్రవళిక, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జిల్లా నరేందర్, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు చిట్టిపోలు గణేష్, రాష్ట్ర పద్మశాలి సంఘం యూత్ అధ్యక్షులు అంబటి శ్రీనివాస్ మరియు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## మంత్రి పయ్యావుల వియ్యంకుడే అతిపెద్ద బియ్యం ఎగుమతిదారు

- ఎంవి కెనస్టర్ అనే నౌక ద్వారా 42,500 మెట్రిక్ టన్నుల పీడీఎస్ బియ్యంను నైజీరియాకు తరలిస్తున్నారు
- పవన్ కళ్యాణ్, మనోహర్ లకు చిత్తశుద్ధి ఉంటే ఈ నౌకలో తనిఖీలు చేయాలి
- పవన్ ను తీసుకువెళ్ళిన తరువాత మంత్రి నాదెండ్లకు కమీషన్లు పెరిగాయి
- మనోహర్ కలెక్షన్ల కోసమే కాకినాడలో ఉంటున్నారు
- రైస్ మిల్లర్ల కోసం రూ.200 కోట్లు విడుదల చేస్తే, దానిలో ఎనిమిది శాతం కమీషన్ల కింద వసూలు
- కాకినాడ పోర్ట్ నుంచి పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా జరుగుతోంది
- 5 నెలలుగా కూటమి ప్రభుత్వం దీనిపై ఏం చేస్తోంది?
- రెండు చెక్ పోస్ట్ లు, కస్టమ్స్ తనిఖీలు దాటి నౌకలోకి బియ్యం ఎలా చేరింది?
- బ్యాంక్ గ్యారెంటీ ఇస్తే సీజ్ చేసిన బియ్యాన్ని వదిలేశారని ఎలా సమర్థించుకుంటారు?
- మీరు అధికారంలో ఉండి... వైయస్ఆర్ సిపిపై ఆరోపణలు ఎలా చేస్తారు?
- కాకినాడ పోర్ట్‌లో పవన్ కళ్యాణ్ సినీఫక్కీలో చేసింది హంగామానే
- కలెక్టర్ తనిఖీలు చేసి సీజ్ చేసిన తరువాత పవన్ మళ్ళీ సీజ్ చేయమడం ఏమిటి?
- యాంకరేజీ పోర్ట్ పూర్తిగా ప్రభుత్వానికి చెందినది
- మాజీ మంత్రి, వైయస్ఆర్ కాంగ్రెస్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు సంచలన ఆరోపణలు

**గుంటూరు, మహానాడు:**

ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ వియ్యంకుడికి చెందిన పట్టాభి ఆగ్రో సంస్థ కాకినాడ పోర్ట్ నుంచి నైజీరియాకు 42,500 టన్నుల పీడీఎస్ బియ్యంను ఎంవి కెనస్టర్ అనే నౌక ద్వారా ఎగుమతి చేస్తోందని మాజీ మంత్రి, వైయస్ఆర్ కాంగ్రెస్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు సంచలన ఆరోపిణలు చేశారు.

దీనిపై తనిఖీలు చేసే ధైర్యం డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి మనోహర్ లకు ఉందా అని ప్రశ్నించారు. పట్టాభి ఆగ్రో సంస్థ ద్వారా ఈ బియ్యాన్ని విదేశాలకు ఎగుమతి చేస్తున్నారని, దీనిని తనిఖీ చేయడం ద్వారా పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాను అడ్డుకోవడంలో తమ చిత్తశుద్ధిని వారు నిరూపించుకోవాలని ఆయన సవాల్ చేశారు.

గుంటూరులోని క్యాంప్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.... కాకినాడ పోర్ట్ నుంచి అక్రమంగా పీడీఎస్ బియ్యం రవాణా జరుగుతున్న అంశంపై నిత్యం డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ లు మాట్లాడుతున్నారు. బియ్యం ఎగుమతుల్లో దేశంలోనే మూడో అతిపెద్ద సంస్థ, రాష్ట్రంలోనే నెంబర్ వన్ స్థానంలో ఉన్న పట్టాభి ఆగ్రో సంస్థ అధినేత



కృష్ణారావు, ఉరఫ్ శ్రీనివాస్.. ఈయన మన రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ కు వియ్యంకుడు.

పట్టాభి ఆగ్రో సంస్థ ద్వారా తాజాగా నైజీరియాకు 42,500 టన్నుల బియ్యం లోడ్ తో ఎంవి కెనస్టర్ అనే నౌక నైజీరియాకు వెళ్ళేందుకు సిద్దంగా ఉంది. సముద్రంలో అలజడి కారణంగా ఇంకా కొంత రైస్ దీనిలో లోడింగ్ చేయాల్సి ఉన్నందున డీప్ సీ పోర్ట్ లో ఈ నౌక నిలిచి ఉంది. ఈ నౌకలోని బియ్యాన్ని తనిఖీ చేసే దమ్ము పవన్ కళ్యాణ్, మంత్రి మనోహర్ లకు ఉందా?

కాకినాడ పోర్ట్ నుంచి పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా జరుగుతోందని కూటమి ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి మీరు ఆరోపిస్తున్నారు. ఇప్పుడు ఆరు నెలలు గడుస్తున్నా ఎందుకు ఈ అక్రమ రవాణాను అరికట్టలేక పోయారు? ఇది మీ అసమర్థత కాదా? వ్యవస్థలను నిర్వహించడంలో మీరు వైఫల్యం చెందినట్లు కాదా? పౌరసరఫరాలశాఖ ఏర్పాటు చేసిన రెండు చెక్ పోస్ట్ లను దాటి, పీడీఎస్ బియ్యం ఎలా సముద్రంలోని నౌకలోకి వెళ్ళింది?

కలెక్టర్ సీజ్ చేసిన బియ్యంను బ్యాంక్ గ్యారెంటీ ఇచ్చి వదిలేశామని ఎలా సమర్థించుకుంటున్నారు? మీ అస మర్థతను కప్పిపుచ్చుకునేందుకు వైఎస్ఆర్సిపి గత పాలనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. పీడీఎస్ బియ్యం తనిఖీలకు పవన్ కళ్యాణ్ ను తీసుకువెళ్ళిన తరువాత, మంత్రి నాదెండ్లకు కమీషన్లు పెరిగాయి. కాకినాడలో పవన్ కళ్యాణ్ హంగామా సినీఫక్కీలో జరిగింది. సీజ్ ద షిప్ అంటూ ఆయన వేసిన ఆర్డర్ చూసి అంతా నిజమే అని అనుకున్నాం. ఒకసారి కలెక్టర్ సీజ్ చేసిన నౌకను మళ్ళీ సీజ్ చేయడం చూస్తే ఇదంతా హైడ్రామా అని అర్థమవుతోంది.

నాదెండ్ల మనోహర్ ప్రెస్‌మీట్‌లో ఏదేదో మాట్లాడారు. కాకినాడపోర్ట్ ద్వారా గత అయిదేళ్ళలో విచ్చలవిడిగా బియ్యాన్ని అక్రమ రవాణా చేశారని ఆరోపించారు. మన రాష్ట్రంలో కాకినాడ పోర్ట్ నుంచి పెద్ద ఎత్తున ఇతర దేశాలకు అన్ని అనుమతులతోనే బియ్యం ఎగుమతి అవుతుంటోంది. ఒడిస్సా, చత్తీస్ ఘడ్, తెలంగాణా రాష్ట్రాల నుంచి ఇక్కడికి వచ్చి కాకినాడ పోర్ట్ ద్వారా ఇతర దేశాలకు ఎగుమతి చేస్తుంటారు.

యాంకరేజ్ పోర్ట్ నుంచి తక్కువ ఖర్చుతోనే ఎగు మతులు చేసుకునే వీలు ఉంది. నడిసముద్రంలో నిలిచి ఉన్న నౌకలోకి పడవల్లో సరుకులను తీసుకువెళ్ళి లోడింగ్ చేస్తారు. దీనివల్ల ఫ్లాట్ ఫాం చార్జీలు పడవు. ప్రభుత్వంకు సంబంధించిన ఈ పోర్ట్ లో అనేక మందికి ఉపాధి లభిస్తూ ఉంటుంది. కొన్ని వేల కుటుంబాలు ఆధారపడి బతుకుతూ ఉన్నాయి. మంత్రి మనోహర్ కలెక్షన్ల కోసమే కాకినాడలో ఉంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో రైస్ మిల్లర్ల కోసం రూ.200 కోట్లు విడుదల చేస్తే, దానిలో ఎనిమిది శాతం కమీషన్ల కింద వసూలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి.

పీడీఎస్ బియ్యంను అక్రమ రవాణా చేసే వారిని పట్టుకోవాల్సిన మంత్రి మనోహర్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ కాకినాడ పోర్ట్ ద్వారా ఆర్డీఎస్ వస్తే ఏం చేస్తారని ప్రశ్నించారు. అసాంఘిక శక్తులు చొరబడితే ఏం చేస్తారని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న మీరే పోర్ట్ భద్రతపై మాట్లాడటం మీ అసమర్థతకు నిదర్శనం. పోర్ట్ భద్రతపై బాధ్యత వహించాల్సింది ఎన్డీఏ ప్రభుత్వాలు కావా?

నాదెండ్ల మనోహర్ ప్రెస్ మీట్‌లో మాట్లాడుతూ కొత్త వాదనను తీసుకువచ్చారు. ఒక పత్రికలో మెయిన్ హెడ్డింగ్ తో దీనిపై వార్తను ప్రచురించింది. ఈ పోర్ట్ అరబిందో తీసు కున్న తరువాతే అక్రమ బియ్యం రవాణా జరిగిపోతునట్లు రాశారు. అరబిందో తీసుకున్నది యాంకరేజీ పోర్ట్ కాదు. కాకినాడ డీప్ సీ పోర్ట్ ని. గతంలో కెవి రావు అనే వ్యక్తికి చెందిన సంస్థ పరిధిలో ఉన్న సీ పోర్ట్ లో 41.2 శాతం వాటాను అరబిందో తీసుకుంది.

కంపెనీల మధ్య షేర్ల కొనుగోళ్ళు, అమ్మకాలు సహజం. మంత్రి మనోహర్ దీనిపై మాట్లాడుతూ కెవి రావు మెడమీద కత్తిపెట్టి అరబిందో ఈ వాటాను తీసుకుందని ఆరోపించడం విడ్డూరంగా ఉంది. ఈనాడు పత్రికకు చెందిన రామోజీరావు కూడా గతంలో తన సంస్థల్లోని వాటాలను ఇతర సంస్థలకు విక్రయించారు. ఎవరు ఆయన మెడమీద కత్తి పెడితే ఆ వాటాలను విక్రయించారు? మంత్రి మనోహర్ దీనికి సమాధానం చెప్పగలరా?

అరబిందో నిర్వహిస్తున్నది సీ పోర్ట్. ఈ పోర్ట్ నుంచి బియ్యం ఎగుమతులు చాలా స్వల్పంగా జరుగుతుంటాయి. ఇక్కడి నుంచి ఎగుమతి చేయాలంటే లోడింగ్, అన్ లోడింగ్, ఫ్లాట్ ఫాం చార్జీలు ఇలా చాలా ఖర్చు అవుతుంది. యాంకరింగ్ పోర్ట్ తో పోలిస్తే సీ పోర్ట్ నుంచి ఎగుమతులు ఎక్కువ వ్యయంతో ఉంటాయి.

## మీరు పిలిస్తే రావాలా ఏంటి?

- అంతా నా ఇష్టం అన్న రాంగోపాల్‌వర్మ
- మళ్లీ అజ్ఞాతం నుంచే వర్మ వీడియో
- పారిపోలేదంటూ బుకాయింపు

**హైదరాబాద్,మహానాడు:**

వివాదాస్పద దర్శకుడు రాంగోపాల్‌వర్మ మరో వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. పోలీసుల విచారణను ప్రశ్నిస్తూ చేసిన వీడియో వైరల్ అవుతోంది. కొన్ని రోజుల క్రితం తానెక్కడికి పారిపోలేదని, పోలీసులు విచారణకు పిలిస్తే తాను వెంటనే విచారణకు రావాలా? అంటూ ఎదురు ప్రశ్నిస్తూ రాంగోపాల్ వర్మ ఒక వీడియో విడుదల చేశారు.

"ఎప్పుడో సంవత్సరం క్రితం ట్వీట్ పెట్టాను. అప్పుడు పెట్టానో నాకు నో నాలెడ్జ్.. కానీ ఎవరి మనోభావాలు దెబ్బతిన్నాయ్. ఎవరు పట్టించుకోనిది వారు ఎందుకు పట్టించుకున్నారు? మనకున్న అనుమానాలను బట్టి యాంటిసిపిటరీ బెయిల్ కోర్ట్ ఇస్తుంది. నాకు బెయిల్ రాలేదు. నవంబర్ 25తేదీన 10 గంటలకు నేను పోలీసులకు రిప్లై ఇచ్చాను"

"20 నిమిషాల్లో పోలీసులు వచ్చారు. అది కూడా మీడియాతో వచ్చారు. నేనప్పుడు డెన్‌లో లేను. కానీ నాపై రకరకాల స్టోరీలు వచ్చాయి. పోలీసులు ఎక్కడా నా కేసు గురించి మాట్లాడింది లేదు. మొత్తం మీడియానే నాపై స్క్రిప్ట్ రాసింది. సోషల్ మీడియాను



కంట్రోల్ చేయటం ఎవరితరం అవుతుంది. నేను ట్రంప్‌పై కమలా హారిస్‌పై కొద్ది రోజుల క్రితం మీమ్ పెడితే రకరకాల ఓపినీయన్స్, కామెంట్స్ వచ్చాయి. కానీ దాన్నెవరు పట్టించుకోరు"

"మెయిన్ స్ట్రీమ్ మీడియాలో వచ్చిన వార్తకు వాల్యూ ఉంటుంది. నాపై అసత్య ఆరోపణలు ప్రసారమయ్యాయి. నాపై పెట్టింది అఫెన్సీవ్ కేసు. సినిమాకు సెన్సార్ బోర్డ్ ఉంటుంది. ప్రతిది డిసైడ్ చేసి సర్టిఫికెట్ ఇస్తుంది. సోషల్ మీడియాకు అది లేదు. ఇది నాకు కాకుండా వేరే వారిపై వార్తలు వచ్చుంటే ఎంజాయ్ చేసేడవాడిని. ఏదైనా నెగిటివ్ థంబ్ ఉంటేనే చూస్తారు. నాపై కావాలనే రకరకాల ప్రాంతాల్లో ఫిర్యాదులు ఇచ్చారు" అని రామ్ గోపాల్ వర్మ కామెంట్ చేశారు.

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || మంగళవారం 03, డిసెంబర్ 2024


## తిరుమల ఘాట్ రోడ్డులో యువకుల వీరంగం!

- కౌన్సిలింగ్ ఇచ్చి విడిచిపెట్టిన పోలీసులు



**తిరుపతి, మహానాడు:** తిరుమల ఘాట్ రోడ్డులో కొందరు యువకులు వీరంగం సృష్టించారు. తిరుపతి నుంచి తిరుమల క్షేత్రానికి వెళ్లే రెండో ఘాట్ లో కారులో ప్రయాణిస్తూ పిచ్చి చేష్టలు చేశారు. తిరుమల క్షేత్ర ఆధ్యాత్మిక క్షేత్రం. నిత్యం గోవింద నామస్మరణతో ఆ ప్రాంతమంతా మారుమోగుతోంది. భక్తులు క్రమశిక్షణతో కొండపైకి చేరుకొని కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరస్వామివారిని భక్తి శ్రద్ధలతో కొలుస్తారు. అయితే, తాజాగా కొందరు యువకులు తిరుమల ఘాట్ రోడ్డులో హద్దులు మీరి ప్రవర్తించారు. భక్తులకు అసౌకర్యం కలుగుతుందన్న ఇంగితజానం లేకుండా ఇష్టమొచ్చినట్టు సెల్ఫీలు దిగుతూ.. ర్యాష్ డ్రైవింగ్ తో రెచ్చిపోయారు. భక్తుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు అదుపులోకి తీసుకున్న యువకులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం అయితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. కారు వేగంగా పోనిస్తూ, కారు డోర్లు తెరిచి యువకులు సెల్ఫీలు తీసుకుంటుండటంతో.. వారి వెనకాలే వచ్చిన వాహనంలోని భక్తులు వీడియో తీశారు. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

## ఆధ్యాత్మిక విజ్ఞానంతో సద్గుణాలు

- చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

**వినుకొండ, మహానాడు:** మానవునికి సద్గుణాలు, సన్మార్గంలో జీవించడానికి గొప్ప అవకాశాలు కలగాలంటే ఆధ్యాత్మికంగా విజ్ఞానం సంపాదించుకోవడం చాలా అవసరమని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. మనిషికి ఎప్పుడైతే ఆధ్యాత్మిక జ్ఞానం పెరుగుతుందో అప్పుడే సంతోషం, శాంతి లభిస్తుందన్నారు. కొత్తపేటలోని శ్రీమహాగణపతి దేవాలయంలో సోమవారం పోలి స్వర్గం పూజలు ఘనంగా జరిగాయి. ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన పాల్గొని విశేష పూజలు చేశారు. వ్యాస మహర్షి రాసిన స్కంద పురాణం ప్రకారం కార్తికమాసం చివరిరోజు అమవాస్య తర్వాత తిథిని పోలి పాడ్యమిగా జరుపుకొంటారు. ఈ సందర్భంగానే ఆలయం వద్ద ఏర్పాటు చేసిన తాత్కాలిక కొలనులో చీఫ్ విప్ జీవీ దీపం వెలిగించి అరటిదొప్పలపై పెట్టి వదిలి, వేదాశీర్వచనాలు పొందారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడం గొప్ప విశేషమని, అందరికీ ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు ఇవ్వాలని, స్వర్గప్రాప్తి ప్రసాదించాలని అమ్మవారిని కోరుకున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గంధం కోటేశ్వరరావు. పీవీ సురేష్ బాబు, గుడి కమిటీ పెద్దలు పాల్గొన్నారు.



## సమిష్టి కృషితోనే పారిశుద్ధ్యం మెరుగు

- రోడ్లు, డ్రైన్ల పనులకు ఎమ్మెల్యే మాధవి శంకుస్థాపన

**గుంటూరు, మహానాడు:** పశ్చిమ నియోజకవర్గంలో 18వ డివిజన్ లో సుమారు రూ.3 కోట్లతో సిసి రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యే గళ్ళా మాధవి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... నియోజక వర్గంలో ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని లక్ష్యంగా



పెట్టుకున్నామని, పారిశుద్ధ్య సమస్యలే అధికంగా ఉన్నట్టు గుర్తించామని, రోడ్డు మీదకు మురుగు నీరు చేరి అధ్వానంగా తయారు అవ్వటంతో రూ. 3 కోట్లతో సిసి రోడ్లు,డ్రైన్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు ఎమ్మెల్యే తెలిపారు. పారిశుద్ధ్యం మెరుగు కోసం సుమారు 100 పుష్ కార్ట్ బండ్లను పశ్చిమ నియోజకవర్గానికి కేటాయించామని చెప్పారు. నగర పరిశుభ్రతకు ప్రజలందరూ సహకరించాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. కాంట్రాక్టర్లు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, వీటి పనులను, నాణ్యతను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉప్పాతల సాంబ, నిమ్మల వెంకట రమణ, సుఖవాసి శ్రీనివాస్, ఆళ్ల హరి, వనమా నరేంద్ర, సానం రమేష్ తదితరులు పాల్గొన్నారు.



**వినుకొండ మార్కాపురం రహదారిలోని 15వ వార్డులో సీసీ డ్రెయిన్ల నిర్మాణానికి చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సోమవారం శంకుస్థాపన చేశారు. 15వ ఆర్థిక సంఘం నుంచి మంజూరైన రూ.13.71 లక్షలతో సీసీ డ్రెయిన్ల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. భూమిపూజ నిర్వహించి పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.**



## వైద్యులు దైవంతో సమానం

- బీజేపీ రాష్ట్ర మైనార్టీ మోర్చా అధ్యక్షుడు షేక్ బాజీ

**గుంటూరు, మహానాడు:** ప్రతి మనిషి జీవితంలో అత్యంత విలువైనది, ప్రధానమైనది ఆరోగ్యమే అని భారతీయ జనతా పార్టీ(బీజేపీ) రాష్ట్ర మైనార్టీ మోర్చా అధ్యక్షుడు షేక్ బాజీ పేర్కొన్నారు. గుంటూరు కొత్తపేట ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గల ఆంధ్ర హాస్పటల్ (ఉమెన్ చైల్డ్ అండ్ మల్టీ స్పెషాలిటీ) లో అత్యవసర విభాగాన్ని షేక్ బాజీ సోమవారం ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా బాజీ మాట్లాడుతూ ప్రాణాపాయ స్థితిలో వచ్చే రోగులకు సేవా భావంతో వైద్య సేవల్ని అందించే వైద్యులు దైవంతో సమానమని అన్నారు. అలాంటి ఉత్తమ సేవల్ని అందిస్తూ రోగులకు ఆరోగ్య ప్రదాతలుగా వైద్యులు ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మేనేజింగ్ డైరెక్టర్ కొండారెడ్డి, డైరెక్టర్ షేక్ రఫీ ప్రముఖ వైద్యులు నాగరాజు, వెంకట్, పలు రంగాలకు చెందిన ప్రముఖులు షేక్ అబ్దుల్ ఖుద్దుస్, షేక్ గౌస్ పీరా, డేవిడ్ రాజు, ఎండీ రావూఫ్, దుర్గాప్రసాద్, సురేష్ జైన్, భాష, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.







## ఉద్యోగం పేరుతో టోకరా..!

- భూ సమస్యలపై క్యూ కట్టిన బాధితులు
- అర్జీలు స్వీకరించిన నూకసాని బాలాజీ, నజీర్ అహ్మద్, కేకే చౌదరి, సజ్జ హేమలత

**మంగళగిరి, మహానాడు:** తనకు హెూం గార్డు జాబ్ ఇప్పిస్తానని చెప్పి తన వద్ద రూ. 7,00,000 లు డబ్బులు తీసుకుని తనను మోసం చేశారని.. తనను మోసగించిన హెూం గార్డు మండ్ల వెంకటేశ్వర్లు, విజయలక్ష్మీ పండిట్ లపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని కృష్ణా జిల్లా చల్లపల్లి మండలం పుచ్చగడ్డ గ్రామానికి చెందిన ఓ బాధితుడు కోరాడు. తెలుగుదేశం పార్టీ(టీడీపీ) ఇక్కడి కేంద్ర కార్యాలయంలో సోమవారం జరిగిన గ్రీవెన్స్ లో నేతలకు ఫిర్యాదు చేశాడు. టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, ఎమ్మెల్యే నజీర్ అహ్మద్, ఖాదీ గ్రామీణ పరిశ్రమల చైర్మన్ కేకే చౌదరి, ఏపీ హ్యాండ్ లూమ్ కో ఆపరేటీవ్ చైర్ పర్సన్ సజ్జ హేమలత లు అర్జీ స్వీకరించి.. విచారణ జరిపించి న్యాయం జరిగేలా చూస్తామని బాధితుడికి హామీ ఇచ్చారు. ఉద్యోగాల పేరుతో జరుగుతున్న మోసాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని.. ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బులు డిమాండ్ చేస్తున్న వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

- నంద్యాల జిల్లా, అవుకు మండలం చెర్లోపల్లికి చెందిన పలువురు గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తూ.. అవుకు యస్ ఆర్ బిసి రిజర్వాయర్ నిమిత్తం భూ సేకరణలో భాగంగా తమ ఊరి గ్రామస్తుల భూములు అన్ని భూ సేకరణ కింద తీసుకుని నష్టపరిహారం చెల్లించారని... కాని మా నాలుగు కుటుంబాల భూములను మాత్రం తీసుకోలేదని.. తమ భూములను కూడా భూ సేకరణ కింద తీసుకుని తమకు నష్టపరిహారం ఇప్పించాలని వారు వేడుకున్నారు.
- తాము అమెరికాలో ఉండటంతో బాపట్ల జిల్లా రేపల్లేలోని తమ స్థలాన్ని కాటూరి వెంకట శివనాగబాబు అనే వ్యక్తి కబ్జా చేసి ఆక్రమించాడని.. స్థలానికి సంబంధించిన అన్ని అధారాలు తమ వద్ద ఉన్నాయని, తమ స్థలాన్ని కబ్జా నుండి



విడిపించి కబ్జా దారులపై కఠిన చర్యలు తీసుకోవాలని శ్రీనాథ్ అనే వ్యక్తి గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేశాడు.
- వారసత్వంగా తమకు సంపూర్ణ హక్కు అనుభవం కలిగిన జిరాయితీ భూములకు ప్రస్తుతం ఆన్ లైన్ అడంగల్, 1బి రాకార్డు నందు తమ సర్వే నెంబర్‌ను పూర్తిగా తొలగించారని.. తమ పేర్లను ఆన్ లైన్ నందు నమోదు చేయించేందుకు అనేక పర్యాయాలు అధికారులకు అర్జీ పెట్టుకున్నా చర్యలు తీసుకోలేదని.. తమ పేర్లను ఆన్ లైన్ చేసి తమకు న్యాయం చేయాలని విశాఖపట్నం జిల్లా భీమిలి మండలం చిట్టివలస గ్రామానికి చెందిన చిల్ల కైలాస్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.
- బాపట్ల జిల్లా జె. పంగులూరు మండలం కొప్పెరపాడు గ్రామానికి చెందిన ఎనికపాటి నారాయణ స్వామి విజ్ఞప్తి గత ప్రభుత్వం చేపట్టిన రీ సర్వే వలన తమకు నష్టం జరిగిందని.. 90 సెంట్ల భూమిని తగ్గించారని.. దీనిపై అధికారులు పరిశీలించి తమకు న్యాయం చేయాలని నేతలకు విజ్ఞప్తి చేశాడు.
- తిరుపతి మున్సిపాలిటీ పరిధిలో తాను చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు రాకపోవడంతో తాను తన కుటుంబం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని.. దయ చేసి తనకు రావాల్సిన బిల్లులు వెంటనే వచ్చే విధంగా చూడాలని తిరుపతికి చెందిన ఆర్. బాబు నాయుడు విజ్ఞప్తి చేశాడు.
- నిరుపేద యానాది కులానికి చెందిన తమ అనుభవంలో ఉన్న పొలాన్ని క్రిస్టియన్ స్కూలుకు ఇచ్చి తమకు గతంలో అన్యాయం చేశారని.. దానిపై పోరాడి అలిసిపోయామని.. తమకు జరిగిన అన్యాయాన్ని గుర్తించి తమకు నివాస స్థలాలు కేటాయించి ఆదుకోవాలని బాపట్ల జిల్లా అద్దంకి గ్రామానికి చెందిన బూదూరి వెంకట్రావు గ్రీవెన్స్ లో విజ్ఞప్తి చేశారు.
- తనకు ప్రభుత్వం ఇచ్చిన భూమిలో సాగు చేసుకుంటుంటే బాలిజమానుతాండాకు చెందిన పలువురు తనపై దాడికి వచ్చారని.. తనపై దాడి చేసిన వారిమీద చర్యలు తీసుకొని.. కబ్జా దారులు అక్రమంగా సృష్టించిన పాస్ బుక్స్, 1బి అడంగల్ రద్దు చేసి తనకు న్యాయం చేయాలని శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం మండలం మాల గుండ్లపల్లి గ్రామానికి చెంది మేకల బాలకృష్ణ విజ్ఞప్తి చేశారు.
- తనకు తన తండ్రి రాసి ఇచ్చిన భూమిని వేరే వారు ఆన్ లైన్ చేయించుకున్నారని... కబ్జా దారులు చేయించుకున్న అక్రమ ఆన్‌లైన్‌ను రద్దు చేసి అసలు భూ హక్కుదారులైన తన పేరుపై భూమిని ఆన్‌లైన్ చేసి తనకు న్యాయం చేయాలని శ్రీ సత్య సాయి జిల్లా కదిరి నియోజకవర్గం తలుపుల మండలం పొలం మాడిక వాండ్లపల్లికి చెందిన సాకే లక్ష్మీ దేవి గ్రీవెన్స్‌లో విజ్ఞప్తి చేశారు.

## దర్శిలో త్వరలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ

- ఐటీ మంత్రి నారా లోకేష్ అంగీకారం
- డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి వెల్లడి
- మంత్రి లోకేష్ కి కృతజ్ఞతలు తెలిపిన లక్ష్మి

**దర్శి, మహానాడు:** నియోజకవర్గ కేంద్రమైన దర్శి పట్టణంలో డిగ్రీ కాలేజీ అవసరం ఎంతైనా ఉందని తెలుగుదేశం పార్టీ(టీడీపీ) దర్శి ఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కి వివరించారు. ఈ మేరకు ఆమె, యువనేత డాక్టర్ కడియాల లలిత్ సాగర్ తో కలిసి ఉండవల్లిలో సోమవారం మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా యువ గళం పాదయాత్రలో పార్టీ ఇచ్చిన మాట ప్రకారం డిగ్రీ కాలేజీ నిర్మాణాన్ని చేపట్టాలని కోరారు. కురిచేడు రోడ్డులో డిగ్రీ కాలేజీకి అవసరమైన ప్రభుత్వ స్థలాన్ని కూడా ఆరు ఎకరాలు కేటాయించామని తెలిపారు.

గత వైసీపీ ప్రభుత్వం డిగ్రీ కాలేజీ నిర్మాణంపై నిర్లక్ష్యం



వహించిందని, ఈ ప్రాంతం వెనుకబడిన ప్రాంతమని, నియోజకవర్గంలోని అయిదు మండలాల్లో జూనియర్ కాలేజీలు ఉన్నాయన్నారు. ఆయా కాలేజీల్లో విద్యనభ్యసించిన విద్యార్థులు ఉన్నత విద్య కోసం ఒంగోలు వంటి ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితులు ఉన్నాయని లక్ష్మి, లలిత్ సాగర్ మంత్రికి వివరించారు. దీనిపై మంత్రి లోకేష్ సానుకూలంగా స్పందించి వెంటనే అంచనాలు రూపొందించి పంపించాలని, త్వరలో దర్శి ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం డిగ్రీ కాలేజీ కల నెరవేరుస్తానని హామీ ఇచ్చినట్టు లక్ష్మి మీడియాకు తెలిపారు.


తొలుత అన్న కాంటీన్ నిర్మాణం, కోల్డ్ స్టోరేజ్ నిర్మాణం, టీటీడీ కల్యాణ మండపం నిర్మాణం, రోడ్ల నిర్మాణాలు ప్రభుత్వ ఆసుపత్రిలో వసతులు, గురుకుల ప్రాథమిక పాఠశాలలో అవసరమైన వసతులు వంటి వాటిపై చర్చించి ప్రభుత్వపరంగా సహకరించాలని కోరారు. దీనిపై లోకేష్ సానుకూలంగా స్పందించి కూటమి ప్రభుత్వం అభివృద్ధి ప్రభుత్వమని ప్రజల అవసరాలు తీర్చడమే లక్ష్యమని ఆయన తెలిపారన్నారు. కాగా, పార్టీ సభ్యత్వ నమోదు, ప్రభుత్వ పథకాల అమలుకు కృషి చేస్తున్న లక్ష్మిని మంత్రి లోకేష్ ప్రత్యేకంగా అభినందించారు.

## ప్రజా సమస్యలు చర్చకు రాకుండా బీజేపీ ప్రభుత్వం అడ్డుపుల్ల!

- సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు

**హైదరాబాద్, మహానాడు:** ప్రముఖ పారిశ్రామిక వేత్త అదానీ ముడుపుల కుంభకోణంపై జాయింట్ పార్లమెంట్ కమిటీ(జేపీసీ) వేయాలని, పార్లమెంట్‌లో ప్రజా సమస్యలు చర్చకు రాకుండా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అడ్డుకుంటుందని సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు డిమాండ్ చేశారు. మణిపూర్‌లో జరుగుతున్న అల్లర్లకు బాధ్యులైన ఆ రాష్ట్ర సీఎంపై చర్యలు తీసుకోవాలి. మరో పక్క దేశంలో పలు చోట్ల మసీదుల కింద దేవాలయాలున్నాయనే నెపంతో అల్లర్లు సృష్టించడం సరికాదన్నారు. మహారాష్ట్ర ఎన్నికల్లో జరిగిన చట్ట ఉల్లంఘనలపై ఈసీ స్పందించాలి. దేశానికి అవసరమైన మౌలికమైన అంశాలపైన పార్లమెంట్‌లో చర్చ జరపాలని ప్రతిపక్షాలు పట్టుపడితే మోదీ ప్రభుత్వం తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకు ప్రయత్నిస్తుందని రాఘవులు అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం లగచర్ల భూ సేకరణను రద్దు



చేయడం రైతుల పోరాట తెగువ సాధించిన విజయంగా అభిప్రాయపడ్డారు. లగచర్లలో ఫార్మా కంపెనీల కాలుష్య సమస్యతో రైతులు వ్యతిరేకించట్లేదని, జీవనాధారమైన భూమి కీలకంగా భావించి పోరాడుతున్నారన్నారు. ఇథనాల్ కంపెనీ ఉపసంహరణ కూడా రైతులు పోరాటం వల్లనే సాధ్యపడిందన్నారు.

## 'కెన్‌స్టార్' షిప్‌ను పవన్ ఎందుకు వదిలేశారు?

- ఆ షిప్‌ను ఎందుకు తనిఖీ చేయలేదు?
- 'కెన్‌స్టార్' షిప్‌లో బియ్యం అక్రమ రవాణా చేస్తోంది ఆర్థిక మంత్రి వియ్యంకు డే
- సముద్రంలోకి వెళ్లిన పవన్‌కళ్యాణ్‌ను అభినందిస్తున్నా
- మచిలీపట్నంలో మీడియా ప్రశ్నలకు బదులిచ్చిన వైయస్సార్‌సీపీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని)

**మచిలీపట్నం,మహానాడు:** తన శాఖ కాకపోయినా ప్రాణాలకు తెగించి ప్రజల ఆస్తిని కాపాడటానికి, షిప్‌ను తనిఖీ చేయడం కోసం సముద్రంలోకి వెళ్లిన డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌ను వ్యక్తిగతంగా అభినందిస్తున్నా. కాకపోతే దానిపై మాకు కొన్ని అనుమానాలు న్నాయి. పవన్‌కళ్యాణ్ ప్రాణాలకు తెగించి సముద్రంలో 'స్టెల్లా' షిప్ వరకు మాత్రమే ఎందుకు వెళ్లారు? పక్కనే ఉన్న 'కెన్‌స్టార్' షిప్ వద్దకు ఎందుకు వెళ్లలేదు? కేవలం 'స్టెల్లా' చుట్టూనే ఎందుకు రౌండ్లు కొట్టి షూటింగ్ చేశారు?.



కాకినాడ పోర్టులో డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ హడావుడి గురించి మీడియాకు చెందిన రెండు పేపర్లు, 10 టీవీ ఛానళ్ల విలేకరులతో నేను మాట్లాడాను. వారిచ్చిన సమాచారం ప్రకారం 'స్టెల్లా'లో 36 మంది ట్రాన్స్‌పోర్టర్లు, 35 వేల టన్నుల బియ్యం ఎగుమతి చేయడానికి తెచ్చుకున్నారని తెలిసింది.

అక్కడి వరకు వెళ్లిన పవన్‌కళ్యాణ్, ఆ పక్కనే లంగరేసి ఉన్న మరో షిప్ 'కెన్‌స్టార్'లో ఎందుకు తనిఖీ చేయలేదు?

## డ్రై ఫ్రూట్ డబ్బాల్లో డ్రగ్స్ రవాణా!

- పసిగట్టి, ఢిల్లీ పార్సిల్‌ను తిరిగి రప్పించిన పోలీసులు
- పరారీలో నిందితులు

**విశాఖపట్నం, మహానాడు:** మత్తుపదార్థాల ఆనవాళ్లు లేకుండా చేస్తామంటూ ఏపీ ప్రభుత్వం గట్టి సంకల్పంతో ముందుకెళ్తుంటే.. గుట్టుచప్పుడు కాకుండా బిజినెస్ చేస్తున్నారు కేటుగాళ్లు. రోజుకో పద్ధతిలో డ్రగ్స్, గంజాయి స్మగ్లింగ్ చేస్తూ పోలీసులకే సవాల్ విసురుతున్నాయి. అయితే, తాజాగా విశాఖపట్నంలో ఓ ముఠా గుట్టు రట్టు చేశారు. దాదాపు 44 కిలోల గంజాయిని సీజ్ చేశారు. ఢిల్లీ కేంద్రంగా ఈ వ్యవహారం నడుస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. పక్కా సమాచారంతో గంజాయి ఉన్న కొరియర్ పార్సిల్స్‌ను వెనక్కు రప్పించారు. పరారీలో ఉన్న ముగ్గురిని త్వరలోనే పట్టుకుంటామని అంటున్నారు.

## కొత్త పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేయాలి

ప్రభాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

**అమరావతి, మహానాడు:** ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దేగల ప్రభాకర్ ను పెదకూరపాడు నియోజకవర్గ శాసన సభ్యుడు భాష్యం ప్రవీణ్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గా దేగల ప్రభాకర్ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఎమ్మెల్యే దేగల ప్రభాకర్ కి పుష్పగుచ్ఛం అందజేసి, ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.



రాష్టంలో నూతన పరిశ్రమల ఏర్పాటు, రాష్టం అభివృద్ధి పథంలో నడిచేవిధంగా కృషి చేయాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. నూతన పరిశ్రమల ఏర్పాటుకు, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా కృషి చేస్తానని ప్రభాకర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో కుర్ర అప్పారావు, మేకల బాబురావు, బొక్కిసం శివరామ్, మేళ్ళం సైదయ్య, రామ్ ప్రభు, తదితరులు పాల్గొన్నారు.

జనం గుండె చప్పుడు
# మహానాడు
06
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ ||మంగళవారం 03, డిసెంబర్ 2024||

# అప్పు తీర్చమంటే ఎంపీ వైఎస్ అవినాష్ పేరు చెప్పి బెదిరిస్తున్నారు!

- పేద రైతుల భూములు ఆక్రమించి ఇంజనీరింగ్ కాలేజీ నిర్మించారు
- మంత్రి నారా లోకేష్ 48వ రోజు ప్రజాదర్బార్ లో ప్రజల విన్నపాలు
- సమస్యలు పరిష్కరించి అండగా ఉంటామని మంత్రి భరోసా

**ఉండవల్లి, మహానాడు:**
విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ 48వ రోజు ప్రజాదర్బార్ కు మంగళగిరితో పాటు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు తరలివచ్చారు. ఉండవల్లిలోని నివాసంలో మంత్రి లోకేష్ ను స్వయంగా కలిసి తమ సమస్యలు విన్నవించారు. ప్రతి ఒక్కరి విజ్ఞప్తిని పరిశీలించిన మంత్రి.. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

- తన వద్ద తీసుకున్న అప్పు చెల్లించకుండా వైసీపీ ఎంపీ అవినాష్ రెడ్డి, వైఎస్ మధు పేరు చెప్పి బెదిరిస్తున్నారని సత్యసాయి జిల్లా తూపల్లికి చెందిన సి.అమ్మాజీ మంత్రి నారా లోకేష్ ను కలిసి ఫిర్యాదు చేశారు. ఏడాది క్రితం పులివెందులకు చెందిన షేక్ సాయి అనే వ్యక్తికి దశలవారీగా రూ.40 లక్షల వరకు అప్పు ఇచ్చాం. ఇప్పటివరకు రూపాయి కూడా చెల్లించకపోగా.. మాపై వేధింపులకు పాల్పడుతున్నాడు. తాం వైసీపీ వ్యక్తులమని, ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, వైఎస్ మధు అనుచరులమంటూ బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విచారించి తగిన న్యాయం చేయడంతో పాటు తమకు ప్రాణరక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు.
- ప్రకాశం జిల్లా మార్కాపురం మండలం, దరిమడుగులో పేద రైతులకు చెందిన 13.70 ఎకరాలను ఆక్రమించి మాజీ మంత్రి, వైసీపీ నేత ఆదిమూలపు సురేష్, అతని సోదరుడు ఆదిమూలపు సతీష్ ఇంజనీరింగ్ కాలేజీ నిర్మించారని, విచారించి తగిన న్యాయం చేయాలని గ్రామానికి చెందిన బట్టగిరి వెంకట రామాంజులరెడ్డి, దర్శికి చెందిన కేసరి రంగలక్ష్మమ్మ మంత్రి నారా లోకేష్ ను కలిసి ఫిర్యాదు చేశారు. 2003 ఏడాదిలో ఆదిమూలపు సురేష్ తండ్రి దివంగత ఆదిమూలపు శ్యామ్యూల్ జార్జ్.. సర్వే నెంబర్ 841/1లో ఆరుగురు పేదరైతులకు చెందిన భూములను తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అనంతరం ఆయా భూముల్లో డాక్టర్ శ్యామ్యూల్ జార్జ్ ఇంజనీరింగ్ కాలేజీ నిర్మించి రైతులకు ద్రోహం చేశారు. ఆ భూముల కోసం 15 ఏళ్లుగా పోరాటం చేస్తున్నామని, ఏ అధికారి ఇంతవరకు స్పందించలేదని కన్నీటిపర్యంతమయ్యారు. విచారించి తమ భూములు తిరిగి ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి భరోసా ఇచ్చారు.
- గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఔట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న 1,800 మందికి వేతనాల పెంపుతో పాటు సర్వీస్ తో కూడిన ఎఫ్‌టీఈ(ఫిక్స్‌డ్ టెన్యూర్ ఎంప్లాయి) వర్తింపజేయాలని రూరల్ డెవలప్ మెంట్ డిపార్ట్ మెంట్(ఎంజీఎన్ఆర్ఈజీఎస్) అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ జేఏసీ ప్రతినిధులు మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వంపై భారం పడకుండానే ఆప్కాస్ ద్వారా ఎఫ్ టీఈ కన్వర్షన్ చేసి ఆదుకోవాలని కోరారు.
- సౌదీ అరేబియాలో అక్రమ నిర్బంధానికి గురైన తన భర్త షేక్ ఇస్మాయిల్ ను విడిపించి స్వదేశానికి రప్పించేలా చర్యలు తీసుకోవాలని ఏలూరు జిల్లా తంగెళ్లమూడికి చెందిన షేక్ నగీన మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. నా భర్త ఏడేళ్ల క్రితం సౌదీ అరేబియా వెళ్లి రొవాడ ఖలీద్ బిన్వాలిద్ లో డ్రైవర్ గా పనిచేస్తున్నారు. ఆ కారు ప్రమాదానికి గురైంది. ఆ ప్రమాదంలో ఎలాంటి నష్టం జరగలేదు. తన భర్త తప్పులేకపోయినా కారు యజమాని కేసు నమోదుచేయడంతో పాటు తన భర్త పాస్ పోర్ట్ స్వాధీనం చేసుకుని రూ.7 లక్షలు నగదు డిమాండ్ చేస్తున్నారని కన్నీటిపర్యంతమయ్యారు. తన భర్తను స్వదేశానికి తీసుకువచ్చేలా సాయం చేయాలని కోరారు.
- ప్రజారవాణ శాఖలో రెగ్యులర్ డ్రైవర్లుగా నియామక పత్రాలు పొందిన తమకు పూర్తి జీతం మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని సిబ్బంది మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. కాంట్రాక్ట్ డ్రైవర్లుగా పనిచేస్తున్న తమను గతేడాది క్రమబద్ధీకరించారు. అయితే 14 నెలలుగా పూర్తి జీతం రాక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.
- మంగళగిరి పట్టణంలోని ఆటోనగర్, ఆల్ఫా సెంటర్, శ్రీ బాలాజీ ఫార్చ్యూన్ టవర్స్ ప్రాంతాల్లో డ్రైనేజీ నిర్మాణంతో పాటు పూర్తి నిడివిగల రోడ్డు సౌకర్యం కల్పించాలని ఆయా ప్రాంతాల నివాసితులు మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి డ్రైనేజీ నీటిని మళ్ళించాలని కోరారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.






















జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
07
డిజిటల్ న్యూస్ పేపర్ || మంగళవారం 03, డిసెంబర్ 2024 ||

## స్థానికులకు టోకెన్ల జారీని ప్రారంభించిన తితిదే ఛైర్మన్ నాయుడు



**తిరుమల,మహానాడు:**
స్థానికులకు తిరుమల శ్రీవారి దర్శన టోకెన్ల జారీ ప్రక్రియ ప్రారంభ మైంది. తిరుపతిలో తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు దీన్ని ప్రారంభించారు.. నగరంలోని మహతి ఆడిటోరియంలో ఈవో శ్యామలరావుతో కలిసి స్థానికులకు టోకెన్లను అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ నాయుడు మాట్లాడుతూ.. నవంబర్ 18న జరిగిన తితిదే బోర్డు తొలి సమావేశంలో ప్రతి నెల మొదటి మంగళవారం స్థానికులకు శ్రీవారి దర్శనం కల్పించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. తితిదే ఈవో శ్యామల రావు మాట్లాడుతూ.. స్థానికుల కోసం తిరు పతిలోని మహతి ఆడిటోరియంలో 7 కౌంటర్లు, తిరుమల బాలాజీ నగర్‌లోని కమ్యూనిటీ హాల్‌లో 3 కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం తిరుపతిలో 2,500, తిరుమలలో 500 టోకెన్లు జారీ చేస్తామన్నారు. ఒరిజినల్ ఆధార్ కార్డుతో తిరుపతి అర్బన్, తిరుపతి రూరల్, చంద్రగిరి, రేణిగుంట, తిరుమల నివాసితులకు టోకెన్లు జారీ చేయనున్నట్లు చెప్పారు. ప్రతి నెల మొదటి ఆదివారం రెండు కేంద్రాల్లోనూ దర్శన టోకెన్లు జారీ చేయనున్నట్లు తెలియజేశారు. స్థానిక భక్తులు ఒకసారి శ్రీవారిని దర్శనం చేసుకున్న 90 రోజుల తర్వాత మాత్రమే తదుపరి దర్శనానికి అర్హులు. భక్తులు సులువుగా టోకెన్లు పొందేందుకు వీలుగా క్యూలైన్లు, టోకెన్ల జారీకి అన్ని ఏర్పాట్లను తితిదే పూర్తి చేసింది. కార్యక్రమంలో తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని తదితరులు పాల్గొన్నారు.



## ఇంటర్ విద్యార్థుల కోసం 'సంకల్ప్'

**అమరావతి,మహానాడు:**
ప్రభుత్వ ఇంటర్ కాలేజీల్లో విద్యార్థుల ఉత్తీర్ణతా శాతాన్ని పెంచేందుకు 'సంకల్ప్-2025' అనే కార్యక్రమాన్ని విద్యామండలి రూపొందించింది. క్వార్టర్లీ పరీక్షల్లో ఫెయిలైన స్టూడెంట్ల అందరినూ ప్రోత్సహించేందుకు లెక్చరర్లు,ఇతర సిబ్బందిని కేర్ టేకర్లుగా నియమించింది. వీరికి ప్రత్యేకంగా క్వశ్చన్ బ్యాంకులు ఇస్తారు. ప్రతి రోజూ సా.3 నుంచి 5 గంటల వరకు స్టడీ అవర్లు నిర్వహిస్తారు. ఇవాళ్టి నుంచే ఈ విధానం అమల్లోకి రానుంది.

## కలెక్టరేట్‌లో పనిచేస్తున్న ట్రెజరీ గార్డు అనుమానాస్పద మృతి

**శ్రీకాకుళం,మహానాడు:**



జిల్లా కలెక్టరేట్ ట్రెజరీ విభాగంలో గార్డుగా పని చేస్తున్న కానిస్టేబుల్ సవర జోక్యో (55) సోమవారం మృతి చెందారు. విధి నిర్వహణలో భాగంగా మృతి చెందడంతో ఎస్.ఐ హరికృష్ణ ఈయన మృతిని అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.విధి నిర్వహణలో మృతి చెందడం వెనుక మరేదైనా కోణం ఉందేమోనని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.ఎస్సై హరికృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## 'ఓయో'లో డ్రగ్స్ పార్టీ

- డ్రగ్స్ పార్టీలో కొరియోగ్రాఫర్ కన్హా మహంతి, ప్రముఖ ఆర్కిటెక్ట్ ప్రియాంక రెడ్డి
- ప్రియాంకరెడ్డి ఇచ్చిన పార్టీలో కన్హా మహంతి



**హైదరాబాద్:** మాదాపూర్ ఓయో రూమ్‌లో డ్రగ్స్ పార్టీ కలకలం రేపింది. డ్రగ్స్ పార్టీలో కొరియోగ్రాఫర్ కన్హా మహంతి పట్టుబడ్డారు. కన్హ మహంతితో పాటు ప్రముఖ ఆర్కిటెక్ట్ ప్రియాంక రెడ్డిని కూడా పోలీసులు పట్టుకున్నారు.

ప్రియాంక రెడ్డి ఇచ్చిన పార్టీలో కన్హా మహంతి పాల్గొన్నట్లు తెలుస్తోంది. ప్రముఖ టీవీ షోలలో కన్హా మహంతి కొరియోగ్రాఫర్‌గా పనిచేస్తున్నారు. ప్రముఖ డ్యాన్స్‌షోలలో చాలా కాలం పాటు పనిచేసిన కన్హా మహంతి పలుమార్లు విజేతగా నిలిచారు. మహంతి, ప్రియాంక రెడ్డి బెంగళూరు నుంచి డ్రగ్స్ తెచ్చి పార్టీ చేసుకుంటున్నట్లు సమాచారం. పార్టీలో పాల్గొన్న నలుగురిని మాదాపూర్ పోలీసులు అరెస్టు చేశారు.పార్టీ జరిగిన ప్రదేశం నుంచి ఎండీఎంఏ డ్రగ్స్‌తో పాటు మరో రెండు రకాల డ్రగ్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

## మహిళా కానిస్టేబుల్‌ని నరికి చంపిన తమ్ముడు

**ఇబ్రహీంపట్నం,మహానాడు:**
రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో పరువు హత్య కలకలం రేపింది. హయత్నగర్ పోలీస్ స్టేషన్లో కానిస్టేబుల్గా పనిచేస్తున్న నాగమణిని సొంత



సోదరుడు పరమేశ్ దారుణంగా హత్య చేశాడు. ఇటీవల ఆమె ప్రేమించి, పెళ్లి చేసుకోవడంతో కుటుంబీకులు ఆగ్రహంతో ఉన్నారు. ఈక్రమంలోనే ఇవాళ ఉదయం డ్యూటీకి వెళ్లొస్తున్న నాగమణిని రాయపోలు-మన్నెగూడ మార్గంలో పరమేశ్ కారుతో ఢీకొట్టాడు. అనంతరం ఆమెను కత్తితో నరికి చంపాడు.

# ప్రజలపై రూ.6,072 కోట్ల ట్రూఅప్ ఛార్జీల భారం

- విద్యుత్ ఛార్జీలు పెంచబోమని ఎన్నికల చంద్రబాబు హామీ ఇచ్చారు
- ఇప్పుడు ప్రతి యూనిట్‌కు సగటున రూ.1.25 పెంచుతున్నారు
- ఫిబ్రవరి తర్వాత మరో రూ.9,412 కోట్ల భారం మోపబోతున్నారు
- మొత్తంగా రూ.15,485 కోట్ల విద్యుత్ భారం
- 6 నెలల్లో రూ.70 వేల కోట్ల అప్పులు
- కాకినాడ పోర్టులో బియ్యం రవాణాపై పవన్ డ్రామా
- తన మంత్రే ఆ శాఖకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు తెలియదా?
- తన మంత్రిపై అనుమానంతో కూడా వెళ్ళి ఉండవచ్చు!
- పోర్టులో బియ్యం ఎగుమతులపై వ్యాపారులతో బీజేపీ నేతల సమావేశాలు
- ఢిల్లీకి తీసుకువెళ్లి మరీ అనుమతులు ఇప్పించింది వాస్తవం కాదా?
- షర్మిలను ఒక పార్టీ నాయకురాలిగా మేం గుర్తించడం లేదు
- విశాఖపట్నం క్యాంప్ కార్యాలయంలో శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ

**విశాఖపట్నం,మహానాడు:**
ట్రూఅప్ ఛార్జీల పేరుతో ప్రజలపై రూ.15,485 కోట్ల భారం మోపేందుకు కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ నెల నుంచి ప్రజలపై రూ.6,072 కోట్ల ట్రూఅప్ ఛార్జీల భారం మోపుతున్నారని, ప్రతి యూనిట్ కు సగటున రూ.1.25 పెంచుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దీన్ని వ్యతిరేకిస్తూ వైయస్సార్‌సీపీ త్వరలోనే తన విధానాన్ని ప్రకటించబోతోందని, తమ పార్టీ ప్రజాగళాన్ని వినిపిస్తుందని వెల్లడించారు.



మండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ ఇంకా ఏం మాట్లాడారంటే..: విద్యుత్ ఛార్జీలు పెంచబోమని ఎన్నికల ముందు చంద్రబాబు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ఏకంగా రూ.6,072 కోట్ల భారాన్ని ట్రూఅప్ ఛార్జీల పేరుతో ప్రజలపై భారం మోపేందుకు ప్రయత్నిస్తున్నారు. ఫిబ్రవరి తర్వాత మరో రూ.9,412 కోట్ల భారం మోపబోతున్నారు. అంటే మొత్తంగా రూ.15,485 కోట్ల మేర విద్యుత్ భారాన్ని ప్రజలపై వేస్తున్నారు. ఇది పూర్తిగా తప్పు. ట్రూఅప్ ఛార్జీల భారాన్ని ప్రభుత్వమే సబ్సిడీగా భరించాలి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు అవుతోంది. ఇప్పటి వరకు రూ. 67,237 కోట్లు అప్పులు చేసింది. ఈ మంగళవారం మరో రూ.4 వేల కోట్లు అప్పు తీసుకోబోతున్నారు. అంటే దాదాపు రూ.70 వేల కోట్ల అప్పులు చేశారు. దీనిలో నుంచి విద్యుత్ ట్రూఅప్ భారం రూ.15,485 కోట్లు డిస్కంలకు చెల్లించలేరా? పెన్షన్ వెయ్యి రూపాయల పెంపు, అరకొర సిలిండర్లు తప్ప ఇప్పటి వరకు ఏ హామీని మీరు నెరవేర్చారు? కనీసం బడ్జెట్ లో మీ హామీలను నెరవేర్చడానికి కేటాయింపులు కూడా చేయలేదు.

కూటమి ప్రభుత్వానికి ఒక విధానం, నిర్దిష్ట ప్రణాళిక లేదు. పాలన అస్తవ్యస్తంగా మారింది. బూడిద ఆదాయం కోసం కూటమి ఎమ్మెల్యేలు పోట్లాడుకుంటున్నారు. దానిపై సీఎం చంద్రబాబు ఏకంగా పంచాయితీ చేస్తున్నారు.

నూతన మద్యం విధానం పేరుతో బెల్ట్‌షాప్‌లకు బహిరంగ వేలం వేస్తున్నారు. విజయనగరం జిల్లాలోని ఒక ఊరిలో బెల్ట్‌షాప్ నిర్వహణను వేలంలో రూ.50 లక్షలకు దక్కించుకున్నారంటే ఈ ప్రభుత్వం ఎంత గొప్పగా పని చేస్తోందో అర్థం చేసుకోవచ్చు. దీనిపై టీడీపీ అనుకూల మీడియాలోనే కథనాలు వచ్చాయి.

కాకినాడ పోర్టులో పవన్ హంగామా. గబ్బర్‌సింగ్ సినిమా పార్ట్-3:

కాకినాడ పోర్టులో డిప్యూటీ సీఎం హెూదాలో పవన్ కళ్యాణ్ చేసిన హంగామా గబ్బర్‌సింగ్ పార్ట్%-%3ని తలపిస్తోంది. బియ్యం అక్రమ రవాణాపై స్థానిక టీడీపీ ఎమ్మెల్యేను నిలదీసిన పవన్‌కళ్యాణ్‌కు అసలు ఆ శాఖకు ప్రాతినిధ్యం వహిస్తున్నది తన పార్టీ సభ్యుడే అనే విషయం తెలియదా? అలాగే పౌర సరఫరాల అధికారులు ఎవరి ఆధీనంలో పని చేస్తున్నారు?.

బియ్యం రవాణాపై సంబంధిత మంత్రి తనిఖీలకు వెళ్ళారంటే అర్థం ఉంది. పవన్‌కళ్యాణ్ కూడా వెళ్లారంటే తన మంత్రిపై అనుమానంతో కూడా వెళ్ళి ఉండొచ్చని అనుకోవాల్సి వస్తోంది. బియ్యం అక్రమ రవాణాపై డిప్యూటీ సీఎం చిత్తశుద్ధి ఏమిటో త్వరలోనే బయటకు వస్తుంది.

దీనిపై మాట్లాడుతున్న బిజెపి నేతలు గతంలో ఏం చేశారో మరిచిపోయారు. పోర్టు నుంచి బియ్యం ఎగుమతులపై వ్యాపారులతో ఆ పార్టీ నేతలు ఇళ్ళలో సమావేశాలు నిర్వహించారు. ఢిల్లీకి తీసుకువెళ్లి మరీ అనుమతులు ఇప్పించిన విషయం వాస్తవం కాదా?

కాకినాడ పోర్టులో పనులు ఏ సామాజికవర్గం వారు చేస్తున్నారంటూ డైవర్షన్ రాతలు పత్రికల్లో రాయిస్తున్నారు. తప్పు జరుగుతోందా? లేదా? తప్పు జరిగితే దానికి ఎవరు బాధ్యులు?. వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నామన్న విషయాన్ని పక్కకు పెడుతున్నారు.

షర్మిలను అసలు మేం ఒక రాజకీయ పార్టీ నాయకురాలిగానే గుర్తించడం లేదని స్పష్టం చేశారు. మాజీ మంత్రులు కారుమూరి నాగేశ్వరరావు, గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ప్రెస్‌మీట్‌లో పాల్గొన్నారు.

# బీజేపీ,బీఆర్ఎస్‌ను దూరంగా ఉంచితేనే రాష్ట్రాభివృద్ధి

- హైదరాబాద్ నక్లెస్ రోడ్‌లో జరిగిన ప్రజాపాలన-ప్రజావిజయోత్సవాల్లో భాగంగా ఆరోగ్య శాఖ నిర్వహించిన ఆరోగ్య ఉత్సవాల కార్యక్రమంలో మాట్లాడిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

**హైదరాబాద్,మహానాడు:**
ఇందిరమ్మ రాజ్యంలో ఏర్పడిన ప్రజా ప్రభుత్వానికి విద్య-వైద్యం రెండు కళ్ళు లాంటివి. వీటికి అత్యధికంగా నిధులు కేటాయించాం. బిజెపి, బీఆర్ఎస్ పార్టీలను రాష్ట్రానికి దూరంగా ఉంచితేనే రాష్ట్రం బాగుపడుతుంది.ప్రజలను రెచ్చగొట్టి అందులోంచి కొంత సానుభూతి పొంది రాజకీయ లబ్ధి పొందాలని కుట్రలు చేస్తున్నబీఆర్ఎస్.

రాజకీయ లబ్ధి కోసం ప్రజలను రెచ్చగొడితే ప్రజా ప్రభుత్వం చూస్తూ ఊరుకోదు. రాష్ట్రంలోని బడుగు బలహీన పేద మధ్య తరగతి ప్రజల వైద్య అవసరాలు తీర్చడం కోసం ప్రజా ప్రభుత్వం కావాల్సిన నిధులను విడుదల చేస్తున్నది. ప్రజా ఆరోగ్యానికి సంబంధించి ఒక్క రోజు కూడా ఆలస్యం కాకుండా నిధులు విడుదల చేస్తూ ఆరోగ్యశాఖ పై ప్రత్యేక దృష్టి సారించి ముందుకు వెళ్తున్నాం.

గ్రామీణ ప్రాంత ప్రజలు, పేద కుటుంబాలు అనారోగ్యానికి గురై మెరుగైన వైద్యం చేయించుకోలేని దుస్థితిలో ఉండి చెట్టుకో పుట్టకో దండం పెట్టే పరిస్థితుల నుంచి మీరు డబ్బులు కోసం ఇబ్బంది పడాల్సిన అవసరం లేదని, రాజీవ్ ఆరోగ్య శ్రీ ద్వారా పది లక్షల రూపాయలు ఖర్చు చేసి బతికించుకుంటామని పేదలకు ధైర్యం చెబుతూ ప్రజా ప్రభుత్వం ముందుకు వెళుతున్నది.

రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకాన్ని ఐదు లక్షల రూపాయల నుంచి 10 లక్షలకు పెంచడం వల్ల రాష్ట్రంలోని పేదలు, గ్రామీణ ప్రాంత ప్రజలు సంతోషంగా ధైర్యంగా జీవించ గలుగుతున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలో సకల సౌకర్యాలు కల్పిస్తు, డాక్టర్లకు, సిబ్బందికి ప్రతినెల జీతాలు ఇస్తూ, వైద్య విద్యార్థులకు స్కాలర్షిప్‌లు అందిస్తూ ప్రజా ప్రభుత్వం వైద్యం పై ప్రత్యేక దృష్టి సారించి ముందుకు పోతున్నదని చెప్పడానికి నాకు గర్వంగా ఉంది. పది సంవత్సరాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పాలకులు ప్రభుత్వ ఆసుపత్రుల్లో సౌకర్యాలను, ఆరోగ్య శ్రీ గురించి పట్టించుకోలేదు, డాక్టర్లు, నర్సింగ్ స్టాఫ్ రిక్రూట్మెంట్, సిబ్బంది నియామకాన్ని విస్మరించారు.ప్రజా ఆరోగ్యాన్ని గాలికి వదిలేసిన బీఆర్ఎస్ పాలకులు ఇప్పుడు తగుదునమ్మా అని బజారు మీదకొచ్చి ప్రజా ప్రభుత్వాన్ని విమర్శించడం విడ్డూరం.

పదేళ్ల పరిపాలనలో గత బిఆర్ఎస్ పాలకులు చేసిన ఏడున్నర లక్షల కోట్ల అప్పులకు సంబంధించిన భారాన్ని ప్రజా ప్రభుత్వం ప్రతి నెల 6500 కోట్లు రూపాయలు చెల్లిస్తూ, ఆ భారాన్ని అధిగమిస్తూ, ఎక్కడ నెరవకుండా ప్రజల కోసం పనిచేస్తున్నది.

అధికారం పోయి సంవత్సరం కూడా ఉండలేక రోడ్డు మీదకు వచ్చి బిఆర్ఎస్ నాయకులు ప్రజా ప్రభుత్వం పై అడ్డగోలుగా మాట్లాడుతున్నారు.దేశంలో 10 ఏళ్లకు పైగా పరిపాలన చేసిన బిజెపి, తెలంగాణలో 10 సంవత్సరాలు పరిపాలన చేసిన బీఆర్ఎస్ పాలకులు ప్రజలకు ఇచ్చిన హామీలను సంపూర్ణంగా అమలు చేయలేని వారు ఏడాది పాలన చేసుకున్న ప్రజా ప్రభుత్వం పై అవాకులు చవాకులు పేల్చడం విడ్డూరం.




పది సంవత్సరాల పైగా అధికారంలో ఉన్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఏడాదికి రెండు కోట్లు ఉద్యోగాలు ఇస్తామని ఇచ్చారా? నోట్లు రద్దు చేసి మూడు నెలల్లో ఫలితాలు చూపిస్తామని చెప్పారు. ఇప్పటి వరకు వాటి ఫలితాలు ఎందుకు చూపించడం లేదు?నోట్ల రద్దుతో దేశంలో దొంగ నోట్లు, నకిలీ నోట్లు బయటకు తీసుకువస్తామని చెప్పారు. ఇప్పటి వరకు ఎందుకు చూపించలేదు?

ప్రతి పేద వాడి ఖాతాలో పదిహేను లక్షలు రూపాయలు జమ చేస్తామని చెప్పిన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఇప్పటి వరకు ఎందుకు పేదల ఖాతాల్లో డబ్బులు జమ చేయలేదు?పదేళ్లకు పైగా పాలన చేస్తూ ప్రజలను మోసగించిన కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న 6 గ్యారంటీలు గురించి విమర్శలు చేయడం విడ్డూరంగా ఉంది.

ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానం మేరకు 500 రూపాయలకే మహిళలకు గ్యాస్ సిలిండర్ ఇస్తున్నాం. గృహ జ్యోతి పథకం కింద పేదలకు ఉచితంగా 200 యూనిట్ల వరకు విద్యుత్తును అందిస్తున్నాం. దేశంలో ఏ రాష్ట్రం కూడా 10 నెలల కాలంలో రైతులకు రుణమాఫీ కింద 21 వేల కోట్ల రూపాయలు నగదు అందించలేదు. రైతులకు ఇచ్చిన వాగ్దానం మేరకు రెండు లక్షల రూపాయల లోపు రుణమాఫీని అమలు చేసిన ఘనత ప్రజా ప్రభుత్వానిది.ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారంగానే దీపావళి నుంచి ఇందిరమ్మ ఇండ్లు మొదలుపెట్టాం.

రాష్ట్రంలోని పబ్లిక్ సర్వీస్ కమిషన్ ను ప్రక్షాళన చేస్తామని చెప్పాం. 55 వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చాం.ఇన్ని మంచి పనులు చేసిన ప్రజా ప్రభుత్వంపై పని లేని బిజెపి నాయకులు రోడ్డు మీదకు వచ్చి విమర్శలు చేయడం విడ్డూరంగా ఉంది.

ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో సహ మంత్రిమండలి సభ్యులందరం ఆలోచన చేసి ఒకేసారి 40% డైట్ చార్జీలు పెంచి అన్ని సదుపాయాలు అందిస్తున్నాం.

రెసిడెన్షియల్ ప్రభుత్వ హాస్టల్లో చదువుతున్న బాలికలకు కాస్మోటిక్ ఛార్జీలు పెంచాం.రాష్ట్రంలో పేద పిల్లలకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యను అందించడానికి మొదటి విడతలో 30, రెండో విడతలో 30 రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణాలకు 5వేల కోట్ల రూపాయలు కేటాయించి ఇందిరమ్మ రాజ్యంలోని ప్రజా ప్రభుత్వం ముందుకు పోతున్నది. హైదరాబాద్ నగరాన్ని విశ్వ నగరంగా మార్చడానికి ప్రజా ప్రభుత్వం ఈ ఏడాది బడ్జెట్లో పదివేల కోట్ల రూపాయలు కేటాయించింది.

కాకతీయుల చరిత్ర చెప్పుకొని గొప్పగా బతికిన బీఆర్ఎస్ పాలకులు గత పది సంవత్సరాల్లో వరంగల్ పట్టణ అభివృద్ధి కోసం ఒక్క రూపాయి ఖర్చు పెట్టలేదు. ఏడాది పాలనలో ప్రజా ప్రభుత్వం వరంగల్ పట్టణ అభివృద్ధి కోసం 6వేల కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిది.

## మాదిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి దంపతులకు బీఆర్ఎస్ ఆత్మీయ వీడ్కోలు

**హైదరాబాద్,మహానాడు:**
బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మాదిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి పదవి విరమణ సందర్భంగా ఆయనకు ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం తెలంగాణ భవన్‌లో ఘనంగా జరిగింది. శ్రీనివాస్ రెడ్డి జలదృశ్యం నుంచి






బంజారాహిల్స్ తెలంగాణ భవన్ దాకా దాదాపు 24 యేండ్లు బీ ఆర్ ఎస్ పార్టీకి చేసిన సేవలను వక్తలందరూ కొనియాడారు.

.ఆయన సేవలను పార్టీ ఎల్లపుడూ గుర్తుంచుకుంటుందన్నారు. తనకు తగిన గుర్తింపు నిచ్చిన కేసీఆర్ కు బీ ఆర్ ఎస్ పార్టీ కి రుణపడి ఉంటానని శ్రీనివాస్ రెడ్డి చెప్పారు .శ్రీనివాస్ రెడ్డి తన ఇన్నేళ్ల అనుభవాలను పుస్తక రూపం లో వ్యక్తీకరించాలని మాజీ మంత్రి ,ఎమ్మెల్యే టి .హరీష్ రావు కోరారు .కేసీఆర్ కు అత్యంత ఇష్టమైన వ్యక్తుల్లో శ్రీనివాస్ రెడ్డి ఒకరని శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూధనా చారి అన్నారు. శ్రీనివాస్ రెడ్డి అమెరికా వెళ్లినా ఎపుడు ఏ అవసరమున్నా తమని సంప్రదించాలని ,తాము కూడా యూ ఎస్ అపుడపుడు వచ్చి యోగ క్షేమాలు కనుకుంటామని మాజీ డిప్యూటీ స్పీకర్ ఎమ్మెల్యే టి .పద్మారావు ,మాజీ మంత్రులు ఎమ్మెల్యేలు ప్రశాంత్ రెడ్డి ,జగదీశ్ రెడ్డి అన్నారు.

ఈ కార్యక్రమం లో శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ,మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ,ఎర్ర బెల్లి దయాకర్ రావు ,గొంగిడి సునీత ,దేవీ ప్రసాద్,దా సోజు శ్రవణ్,ఎర్రోళ్ల శ్రీనివాస్,చిరుమళ్ల రాకేష్ కుమార్ తదితరులు కూడా మాట్లాడారు .పలువురు ఎమ్మెల్యేలు ,ఎమ్మెల్సీలు ,కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు ,వివిధ జిల్లాల నుంచి తరలి వచ్చిన పార్టీ నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.శ్రీనివాస్ రెడ్డి కుటుంబసభ్యులను బీ ఆర్ ఎస్ పార్టీ పక్షాన ఘనంగా సన్మానించారు .మాజీ మంత్రి, ఎమ్మెల్యే టి.హరీష్ రావు శ్రీనివాస్ రెడ్డి కుటుంబ సభ్యులను వారి వాహనంలో కూర్చోబెట్టి తెలంగాణ భవన్ నుంచి సాదరంగా వీడ్కోలు పలికారు.

## సముద్రంలో హడావుడి కాదు... స్మగ్లింగ్‌ను ఛేదించాలి

- మూడేళ్లలో 2 కోట్ల టన్నుల రేషన్ బియ్యాన్ని ఎలా సేకరించారు?
- వెనకున్న బియ్యం దొంగలెవరు?
- రూ.48 వేల కోట్లు ఎవరెవరు తిన్నారు?
- అప్పటి ప్రభుత్వ పెద్దలకు మాఫియాతో సంబంధాలు ఉన్నాయా?
- ఏపీసీసీ చీఫ్ షర్మిల మండిపాటు



**విజయవాడ, మహానాడు:**
రాష్ట్రంలో పీడీఎస్ రైస్ విదేశాలకు తరలించడం పెద్ద మాఫియా.. ఇదో జాతీయ స్థాయి అవినీతి.. పేదల పొట్టకొట్టి 48 వేల కోట్ల రూపాయల ప్రజల డబ్బును పందికొక్కుల్లా తినేసిన దోపిడీ. తిలా పాపం తలా పిడికెడు అన్నట్లు.. రేషన్ బియ్యం స్మగ్లింగ్ వెనుక ప్రజా ప్రతినిధుల ప్రమేయం ఉందని ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి అన్నారు. కింద నుంచి ఉన్నత స్థాయి వరకు కొంతమంది అవినీతి అధికారుల పాత్ర ఉంది... ఎవరికి దక్కాల్సిన వాట వాళ్లకు చేరుతుండటంతో నిఘా వ్యవస్థ పూర్తిగా కళ్ళుమూసుకుందని వ్యాఖ్యానించారు. ఇంకా, ఆమె ఏమన్నారంటే..

గడిచిన మూడేళ్లలో రాష్ట్రంలోని పోర్టుల నుంచి 2 కోట్ల టన్నుల రేషన్ బియ్యం అక్రమంగా రవాణా అయ్యిందంటే చెక్ పోస్టుల పని తీరు ఏంటో అంచనా వేయొచ్చు. ఏ స్థాయిలో అవినీతి జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. అక్రమ బియ్యాన్ని పట్టేందుకు మీరు బోట్లు వేసుకొని సముద్రంలో హడావుడి చేయడం కాదు. నిజాలు నిగ్గు తేల్చాలని కూటమి ప్రభుత్వాన్ని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోంది. పేదలకు దక్కాల్సిన రేషన్ బియ్యం అక్రమంగా పోర్టు దాకా ఎలా చేరుతుంది? మూడేళ్లలో 2 కోట్ల టన్నుల రేషన్ బియ్యాన్ని ఎలా సేకరించారు? దీని వెనకున్న బియ్యం దొంగలెవరు? రూ.48 వేల కోట్లు ఎవరెవరు తిన్నారు?

అప్పటి ప్రభుత్వ పెద్దలకు బియ్యం మాఫియాతో సంబంధాలు ఉన్నాయా? తీగ లాగితే వెనకున్న డొంక ఎక్కడ? మిల్లర్ల చేతివాటం ఉందా? రేషన్ డీలర్ల మాయాజాలమా? అనునిత్యం తనిఖీల సంగతి ఏంటి? నిజాలు నిగ్గు తేల్చాల్సిన అవసరం ఉంది. పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు కమిటీ వేయాలి. లేదా కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐతో విచారణ జరిపించాలి.

ఆంధ్రప్రదేశ్ అంటే అన్నపూర్ణమ్మ. ధాన్యాగారానికి భాండాగారం. ప్రపంచానికి అన్నం పెట్టే రాష్ట్రాన్ని రేషన్ బియ్యం మాఫియాకు అడ్డాగా మార్చారు. ఆరుగాలం కష్టించి పండించే రైతుకు దక్కేది కన్నీళ్లు అయితే... బియ్యం అక్రమార్కులకు దక్కుతున్నవి కాసులు. ఇది ఆంధ్ర రాష్ట్ర దుస్థితి.

జనం గుండె చప్పుడు
# మహానాడు
8
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ ‖ మంగళవారం 03, డిసెంబర్ 2024 ‖

## హెచ్ఐవీ ఎయిడ్స్‌కు వ్యాక్సిన్.. 100 శాతం సక్సెస్?



**న్యూఢిల్లీ:** లెనాకాపవిర్ (Sunlenca బ్రాండ్) అనే డ్రగ్ తో ఏడాదికి 2 టీకాలు వేయడం ద్వారా హెచ్ఐవీ ఎయిడ్స్ ను నివారించ వచ్చని తేలింది. అయిదు వేల మంది మహిళలపై నిర్వహించిన క్లినికల్ ట్రయల్స్ లో 100% ప్రభావవంతంగా పనిచేసినట్టు వెల్లడైంది. ఇది ఎయిడ్స్ నివారణలో కీలక మలుపు అని గిలియడ్ కంపెనీ తెలిపింది. ఇప్పటికే అమెరికా, కెనడా, ఐరోపా దేశాల్లో ఈ వ్యాక్సిన్ అందుబాటులో ఉందని, 120 పేద దేశాల్లో తక్కువ ధరకు అందిస్తామని ప్రకటించింది.

**ది సబర్మతి రిపోర్ట్ సినిమాని వీక్షించాను... తోటి పార్లమెంటేరియన్లు జేపీ నడ్డా జీ, అమిత్ షా జీ, రాజ్‌నాథ్ సింగ్ జీ, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జీ కూడా ప్రేక్షకుల్లో భాగమయ్యారని భారతీయ జనతా పార్టీ(బీజేపీ) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి 'ఎక్' ఖాతాలో పేర్కొన్నారు.**




## హిందూ సంతుష్టీకరణ జరగాలి

కేంద్ర ప్రజా ప్రభుత్వం 'హిందూ సంతుష్టీకరణ'ను చేపట్టాలి. అందుకు సరైన సమయం వచ్చేసింది. మహారాష్ట్ర ఎన్నికల ఫలితం దేశ హిందువుల మనోగతాన్ని గట్టిగా తెలియజేస్తోంది. బీ.జే.పీ. ఘనవిజయం హిందువులు ఏకీకృతం అయినందువల్లే సాధ్య పడింది.

హిందువులే బీ.జే.పీ.ని గెలిపించారు గెలిపిస్తారు. ఇది మారదు. ఈ మట్టి నుంచి, ఈ దేశం నుంచి ఎంత తిన్నా, ఎంత లబ్ధి పొందినా, అనర్హంగా ఎంత ఆదాయం పొందినా విదేశీ మతోన్మాదులకు ఇది మనదేశం, ఇది మనమట్టి అన్న భావన ఉండదుబీ రాదు. విదేశీ మతోన్మాదానికి ఈ దేశం మత మయం, హిందూ వినాశనమే లక్ష్యాలు.

ముస్లీమ్, క్రిస్టిఅన్ ఓట్లతో గెలుద్దాం, కుల చిచ్చుపెట్టి గెలుద్దాం అన్న దుష్ట రాజకీయ క్రీడకు ఇక కాలం చెల్లాలి. హిందూ ఓటుతోనే రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఏర్పడాల్సిన స్థితి రావాలి.

ఒక ముస్లీమ్ సంస్థ దేశ సుప్రీంకోర్టునే హెచ్చరించింది. అత్యంత అపాయకరమైన పరిణామం ఇది. ఒక విదేశీ మతసంస్థ దేశ సుప్రీమ్ కోర్ట్ ను హెచ్చరించే స్థితి వచ్చిందంటే దానికి కారణం ఏమిటి? స్వతంత్రం వచ్చినప్పటి నుంచి జరిగిన విదేశీ



మత సంతుష్టీకరణ, క్షుద్ర రాజకీయం కారణాలు కాగా ఒక విదేశీ మతం దేశ సర్వోన్నత న్యాయస్థానాన్నే హెచ్చరించింది. ఈ పరిణామం దేశంలో జరిగిన భయంకరమైన తప్పిదాన్ని తెలియజేస్తోంది. ఆ తప్పు దేశానికి పెనుముప్పు. ఆ తప్పును సరి చేసుకోవాలి.

వెస్ట్ బెంగాల్, కేరళ, మణిపూర్ వంటి కొన్ని రాష్ట్రాల్లో విదేశీ మతోన్మాదానికి హిందువుల ప్రాణాలకు, ఆస్తులకు, శాంతి భద్రతలకు దారుణంగా నష్టం జరిగింది, జరుగుతోంది.

స్వతంత్రం వచ్చినప్పటి నుంచీ ఈ దేశంలో హిందువులు చిన్న చూపుకు బలయ్యారు. విదేశీ మతాల సంతుష్టీకరణవల్ల హిందువుల హక్కులు, అవకాశాలు, అభివృద్ధి, సంక్షేమం, చివరకు రక్షణ కూడా అణిచివేయబడ్డాయి. స్వతంత్ర భారతదేశంలో హిందువులు అణిచివేతకు గురైయ్యారు. అణచివేతకు గురైన, బలైన హిందువులకు కొత్త బలం కావాలిబీ హిందువులకు రక్షణ కావాలిబీ హిందువులకు మనుగడ కావాలి. విదేశీ మతస్థుల నుంచి హిందువులకు బలమైన చట్టాలతో భద్రత కావాలిబీ హిందువులకు ప్రత్యేకమైన చట్టాలు కావాలిబీ హిందువులకు హక్కులు కావాలిబీ హిందువులకు భవిష్యత్ కావాలి.

కేంద్ర ప్రజా ప్రభుత్వం హిందువులకు అండగా ఉండాలిబీ హిందువులను రక్షించుకోవాలి. హిందువులు, బీ.జే.పీ., ఆర్.ఎస్.ఎస్., ఇతర జాతీయతా వాద శక్తులు కలిసి పని చేస్తూ భారతదేశాన్ని దక్కించుకోవాలి.

తథాస్తు..

**- రోచిష్మాన్**
**9444012279**

## గొప్ప కార్యకర్త మీర్జా మహ్మద్ అలీ



- టీడీపీ నేతలు

**మంగళగిరి, మహానాడు:**
తెలుగుదేశమే తన ప్రాణంగా.. తెలుదేశం జెండానే తన ఊపిరిగా.. పసుపు సైనికుడై.. పసుపు చొక్కా ధరించి.. పార్టీ కోసం కష్టపడి కన్నుమూసిన గొప్ప కార్యకర్త మీర్జా మహ్మద్ అలీ అని టీడీపీ నాయకులు కొనియాడారు. ఈ సందర్భంగా నేతలు సోమవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూల దండలు వేసి ఘన నివాళులు అర్పించారు. కృష్ణా జిల్లా పమిడిముక్కల మండలం అలీఖాన్ పేటకు చెందిన మహ్మద్ అలీకి పార్టీ పట్ల ఉన్న అభిమానాన్ని, చిత్త శుద్ధిని ప్రశంసించారు.

ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. టీడీపీకి కార్యకర్తలే వెన్నెముక అని.. అలీ లాంటి కార్యకర్తలను చూస్తే అది స్పష్టం అవుతుందన్నారు. పార్టీ ప్రతిపక్షంలో ఉన్నా అధికార పక్షంలో ఉన్నా.. ఎటువంటి ఒత్తిడీలకు లొంగకుండా పార్టీ కోసం, పార్టీ శ్రేయస్సు కోసం పనిచేసిన గొప్ప కార్యకర్త మీర్జా మహ్మద్ అలీ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అశోక్ బాబు, ఏపీ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజి, ఎమ్మెల్యే నజీర్ అహ్మద్, ఖాదీ గ్రామీణ పరిశ్రమల చైర్మన్ కేకే చౌదరి, ఏపీ హ్యాండ్ లూమ్ కోఆపరేటీవ్ చైర్ పర్సన్ సజ్జ హేమలత, మీడియా కోఆర్డినేటర్ ధారపనేని నరేంద్ర బాబు, పర్చూరి కృష్ణ, టీడీపీ కేంద్ర కార్యాలయ రిసెప్షన్ ఇన్చార్జ్ హాజీ హసన్ బాషా, గౌస్ తదితరులు పాల్గొన్నారు.



**సత్తెనపల్లి పట్టణంలో మస్జిద్-ఏ-బిలాల్-హుదా పునఃనిర్మాణ, శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన, సత్తెనపల్లి నియోజకవర్గ శాసన సభ్యుడు కన్నా లక్ష్మి నారాయణ. ఈ కార్యక్రమం లో వివిధ హోదాల్లో ఉన్న రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ, వార్డు నాయకులు, కార్యకర్తలు, మత పెద్దలు పాల్గొన్నారు.**

## ప్రజలపై రూ.15,484 కోట్ల సర్దుపోటు!

- విద్యుత్ బిల్లుల పెంపుపై సీపీఎం నేతల మండిపాటు
- నగరంలో పర్యటించి, బిల్లులను పరిశీలించిన నాయకులు

**విజయవాడ, మహానాడు:**
కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలల తిరగక ముందే 15,484 కోట్ల రూపాయల విద్యుత్ భారాన్ని ప్రజలపై వేయడం దారుణం.. 2022 -23 సంవత్సరాల్లో వినియోగించుకున్న విద్యుత్‌పై 6072 కోట్ల రూపాయల సర్దుబాటు చార్జీల పేరుతో నేడు జనం నుండి వసూలు చేయటం శోచనీయం.. వచ్చే నెల నుండి 2023 -24 సర్దుబాటు చార్జీ 9412 కోట్ల రూపాయల భారం పడనున్నదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సిహెచ్ బాబురావు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు బాబురావు.. పలువురు పార్టీ నేతలతో కలిసి నగరంలోని అజిత్ సింగ్ నగర్, 58వ డివిజన్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ నెల వచ్చిన విద్యుత్ బిల్లులను పరిశీలించారు. పెరిగిన విద్యుత్ బిల్లులపై పోరుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

అజిత్ సింగ్ నగర్‌లోని లింగం వెంకటలక్ష్మి కి మొత్తం రూ. 958 బిల్లు రాగా, అందులో రూ. 282 (30%)2022-23 సర్దుబాటు చార్జీ మోపారు. విద్యుత్ ఛార్జీలు 30 శాతం ఉండగా సర్దుబాటు చార్జీలు, అదనపు చార్జీలు 70 శాతం ఉండటం దారుణం. ఈ సర్దుబాటు చార్జీల పాపం పాలక పార్టీలన్నింటిది. కేంద్రంలోని బీజేపీ, గతంలో పాలించిన వైసీపీ, నేడు పాలిస్తున్న తెలుగుదేశం, జనసేన పార్టీలు వీటికి బాధ్యత వహించాలి. ఈ కార్యక్రమంలో నేతలు బి.రమణరావు, కె. దుర్గారావు, సి.హెచ్.శ్రీనివాస్, నిజాముద్దీన్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## 'డే విత్ సీబీఎన్'లో సీఎంను కలిసిన ఎన్ఆర్ఐ!

- స్వీడన్ నుంచి వచ్చి ఎన్నికల సమయంలో 5 నెలల పాటు పార్టీ కోసం పనిచేసిన నవీన్
- పార్టీ కోసం పనిచేసిన వారికి సీఎంతో ఒక రోజంతా ఉండే అవకాశం కల్పించిన పార్టీ
- ఎన్నికల్లో ఉత్తమ సేవలు అందించిన ఉన్నం ను ఇంటికి ఆహ్వానించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

**అమరావతి, మహానాడు:**
సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ కోసం పనిచేసిన వారిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారు ముఖ్యమంత్రిని కలిసి, ఒక రోజంతా ఉండే అవకాశాన్న పార్టీ కల్పించింది. ఈ కాన్సెప్ట్ తో రూపొందించిన డే విత్ సీబీఎన్ కార్యక్రమంలో భాగంగా స్వీడన్ కు చెందిన ఎన్ఆర్ఐ ఉన్నం నవీన్ కుమార్ ను ముఖ్యమంత్రి తన ఇంటికి ఆహ్వానించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సీఎంతో ఉండే అవకాశాన్ని కల్పించారు. సార్వత్రిక ఎన్నికల్లో సమయంలో స్వీడన్ నుంచి వచ్చిన నవీన్ కుమార్ అయిదు నెలల పాటు తెలుగుదేశం పార్టీ(టీడీపీ) విజయం కోసం పని చేశారు. ఆ సమయంలో చంద్రబాబు పిలుపు మేరకు వందల సంఖ్యలో ఎన్ఆర్ఐలు సొంత రాష్ట్రానికి వచ్చి చంద్రబాబును సీఎం చేసుకుంటే కలిగే లాభాలపై ప్రజలను చైతన్య పరిచారు.

అలా నాడు విదేశాల నుంచి వచ్చి ఎన్నికల్లో పనిచేసిన వారికి



గౌరవించుకునే కార్యక్రమంలో భాగంగా.. నాటి సేవల్లో టాప్ లో ఉన్న వారికి పిలిచి గౌరవించాలని సీఎం భావించారు. ఈ క్రమంలో నాడు పార్టీ కుప్పం సహా శ్రీకాళహస్తి, సూళ్లూరు పేట, చంద్రగిరి నియోజకవర్గాల్లో తెలుగు దేశం అభ్యర్థుల గెలుపు కోసం నవీన్ కృషిచేశారు. ఈ క్రమంలో నాడు ప్రకటించినట్టు నవీన్ ను సీఎం ఇంటికి పిలిచి మాట్లాడారు. రోజంతా సీఎం నివాసంలో ఉన్న నవీన్ ముఖ్యమంత్రి రోజూ వారీ రివ్యూలు, పనితీరు ను గురించి తెలుసుకున్నారు. రాష్ట్రం, రాష్ట్ర భవిష్యత్ కోసం ఎన్ఆర్ఐలు వివిధ దేశాల నుండి ఎన్నికల సమయంలో సొంతూళ్లకు వచ్చి పని చేయడం ఎంతో స్ఫూర్తిదాయకం అని ఈ సందర్భంగా సీఎం అన్నారు.

ఎటువంటి లాభాపేక్ష లేకుండా రాష్ట్రం బాగుండాలనే బాధ్యతతో పని చేసిన ఎన్ఆర్ఐలందరినీ ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. ఎన్ఆర్టి మాజీ అధ్యక్షుడు డాక్టర్ రవి వేమూరు నేతృత్వంలో ఏపీకి వచ్చి పనిచేసిన ఎన్ఆర్ఐలలో నవీన్ ముందు వరుసలో నిలిచారు. దీంతో సోమవారం ముఖ్యమంత్రితో డే విత్ సీబీఎన్ కార్యక్రమానికి నవీన్ కు అవకాశం ఇచ్చారు. దేశంలో ప్రముఖ నేత అయిన చంద్రబాబు నాయుడుతో కలిసి ఒక రోజంతా ఉండడంపై నవీన్ సంతోషం వ్యక్తం చేశారు. చంద్రబాబును అభిమానించే వారికి, నేడు తనకు ఇచ్చిన అవకాశం మరింత ఉత్సాహాన్ని ఇస్తుందని నవీన్ అన్నారు. స్వయంగా సీఎం ఒక రోజు పనితరును దగ్గర ఉండి చూసే అవకాశం కల్పించిన ముఖ్యమంత్రికి నవీన్ ధన్యవాదాలు తెలిపారు.

## విశాఖ డెయిరీ అవినీతిపై విచారించనున్న ప్రత్యేక హౌస్ కమిటీ

**అమరావతి, మహానాడు:** విశాఖ డెయిరీలో పలు అక్రమాలు, అవకతవకలు జరిగినట్టు వచ్చిన ఆరోపణలపై విచారించేందుకు ప్రత్యేక హౌస్ కమిటీ ప్రాథమిక సమావేశం ఈ నెల మూడోతేదీ మంగళవారం ఉదయం 11.00 గంటలకు రాష్ట్ర శాసన సభ కమిటీ హాల్లో జరుగునుంది. ఈ మేరకు రాష్ట్ర శాసన సభా సెక్రటరీ జనరల్ ప్రసన్న కుమార్ సూర్యదేవర ఒక ప్రకటనలో తెలిపారు.

## రివాల్వర్‌తో కాల్చుకుని ఎస్ఐ ఆత్మహత్య!

- ములుగు జిల్లాలో ఘటన
- దర్యాప్తు చేస్తున్న పోలీసులు



**ములుగు, మహానాడు:** సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని ఓ ఎస్ఐ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ దుర్ఘటన ములుగు జిల్లాలో సోమవారం ఉదయం చోటుచేసు కుంది. వాజేడు మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో రుద్రారపు హరీశ్ ఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఏటూరు నాగారం మండల పరిధిలోని ముళ్ల కట్ట వంతెన సమీపంలో ఉన్న ఓ రిసార్ట్‌లో హరీశ్ ఈ ఘటనకు పాల్పడ్డాడు. జిల్లాలో ఆదివారం ఉదయం భారీ ఎన్ కౌంటర్ సంభవించింది. ఈ సంఘటన తర్వాత వాజేడు ఎస్ఐ ఆత్మహత్య కలకలం రేపుతోంది. సమాచారం అందుకున్న ఉన్నతాధికారులు సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## దేశ వ్యాప్తంగా 1,708 లిస్టెడ్, 3,383 అన్‌లిస్టెడ్ పబ్లిక్ కంపెనీలు



**-నరసరావుపేట ఎంపీ కృష్ణ దేవరాయలు ప్రశ్నకు కేంద్రం సమాధానం**

**న్యూఢిల్లీ,మహానాడు** 2024 నవంబర్ 15 నాటికి.. రూ.100 కోట్లు అంతకంటే ఎక్కువ లేదా రూ.300 కోట్లు అంతకంటే ఎక్కువ టర్నోవర్ తో దేశ వ్యాప్తంగా 1,708 లిస్టెడ్ కంపెనీలు, 3,383 అన్‌లిస్టెడ్ పబ్లిక్ కంపెనీలు ఉన్నాయని టీడీపీ ఫ్లోర్ లీడర్, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు అడిగిన ప్రశ్నకు కార్పొరేట్ వ్యవహారాల కేంద్ర సహాయ మంత్రి హర్ష మల్హోత్రా లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

కంపెనీల చట్టం, 2013 ప్రకారం.. బోర్డుల్లో ప్రైవేట్ కంపెనీలు కనీసం ఇద్దరు డైరెక్టర్లను, ప్రభుత్వ కంపెనీలు 3 డైరెక్టర్లను కలిగి ఉండాలని, లిస్టెడ్, అన్ లిస్టెడ్ కంపెనీలలో మొత్తం డైరెక్టర్ల సంఖ్య 34,121 కాగా, వారిలో 6,639 మంది మహిళా డైరెక్టర్లు ఉన్నారని తెలిపారు. నిర్దేశిత ప్రభుత్వ కంపెనీల్లో చట్టం ప్రకారం కనీసం ఒక మహిళా డైరెక్టర్ ను నియమించాలని, లేని పక్షంలో చట్టంలోని సెక్షన్ 172 కింద విధించే పెనాల్టీకి కంపెనీ, ప్రతి అధికారి బాధ్యులు అవుతారని పేర్కొన్నారు.

ఇప్పటివరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నమోదైన ఏ కంపెనీపైనా శిక్షాస్పద చర్యలు తీసుకోలేదని వెల్లడించారు. దేశవ్యాప్తంగా ఉన్న కార్పొరేట్ బోర్డులలో లింగ వైవిధ్యంపై కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై ప్రశ్నించగా.. నిర్దేశిత కంపెనీలకు కనీసం ఒక మహిళా డైరెక్టర్‌ని కలిగి ఉండటం తప్పనిసరి చేసే నిబంధనలు ఏవీ లేవని, కానీ కంపెనీ నిర్ణయాలు తీసుకోవటంలో వారి భాగస్వామ్యం తీసుకోవచ్చని, ఈ నిబంధనలను మరింత సవరించే ప్రతిపాదన ప్రస్తుతం లేదని చెప్పారు.

## ప్రభుత్వ ఆస్పత్రుల్లో డాక్టర్ల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు


- 280 సివిల్ అసిస్టెంట్ సర్జన్ల ఖాళీల భర్తీ
- సెకండరీ హెల్త్ లో 97 స్పెషలిస్ట్ డాక్టర్ల భర్తీ
- ఈనెల 4 నుంచి 13 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు అవకాశం
- రెగ్యులర్ పోస్టులతో పాటు బ్యాక్‌లాగ్ పోస్టులు కూడా భర్తీ
- అభ్యర్థుల అర్హతలు, మార్గదర్శకాలు నోటిఫికేషన్‌లో వెల్లడి

**అమరావతి, మహానాడు:** ప్రభుత్వ ఆస్పత్రుల్లో డాక్టర్ల పోస్టుల భర్తీకి విడివిడిగా రెండు నోటిఫికేషన్లు జారీ అయ్యాయి. ప్రజారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ పరిధిలో, ఏపీ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్మెంట్ బోర్డు 280 సివిల్ అసిస్టెంట్ సర్జన్ల ఖాళీల భర్తీ కోసం ఒక నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ఖాళీల్లో రెగ్యులర్ ప్రాతిపదికన జరిగే నియామకాలతో పాటు బ్యాక్‌లాగ్ పోస్టులు కూడా కలిసి ఉన్నాయి.

నోటిఫికేషన్ ప్రకారం, ఎంపికైన వారిని పీహెచ్‌సీలు /ఇతర వైద్య సంస్థల్లో నియమిస్తారు. అర్హత గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. http:apmsrb.ap.gov.in/msrb/ వెబ్‌సైట్‌లో దరఖాస్తు ఫారం ఉంటుందని, ఈనెల 4 నుంచి 13వ తేదీలోపల దరఖాస్తుల చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది.

## లోక్ నాయక్ ఫౌండేషన్ నుంచి ఉత్తమ పాత్రికేయులకు 'నార్ల' పురస్కారాలు

- విశ్వహిందీ పరిషత్ జాతీయ అధ్యక్షుడు, పద్మ భూషణ్, ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ ప్రకటన



**విజయవాడ, మహానాడు:** దివంగత నార్ల వెంకటేశ్వరరావు పేరిట ఇకపై ప్రతి సంవత్సరం ఉత్తమ పాత్రికేయ అవార్డులను అందించనున్నట్టు పద్మ భూషణ్, విశ్వహిందీ పరిషత్ జాతీయ అధ్యక్షుడు, అచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ ప్రకటించారు. లోక్ నాయక్ ఫౌండేషన్ నేతృత్వంలో ప్రతి సంవత్సరం ముగ్గురు జర్నలిస్టులకు ఒక్కొక్కరికీ రూ.50వేల నగదు పురస్కారంతో విజయవాడ వేదికగా నార్ల ఉత్తమ పాత్రికేయ అవార్డులను అందిస్తామని వెల్లడించారు. గ్రామీణ, పట్టణ, నగర ప్రాంతాల నుండి ఒక్కొక్కరిని ఎంపిక చేస్తామని, ఇందుకోసం లబ్ధప్రతిష్టులతో కమిటీని ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

అవార్డుల ప్రదానం ప్రతి సంవత్సరం డిసెంబరు 1 వతేదీన క్రమం తప్పకుండా జరుగుతుందని అచార్య యార్లగడ్డ స్పష్టం చేశారు. లోక్ నాయక్ ఫౌండేషన్ 21 ఏళ్ళుగా విశాఖ వేదికగా ఉత్తమ సాహితీ వేత్తలకు రూ.2 లక్షల పురస్కారం, ముగ్గురు సామాజిక సేవకులకు జీవన సాఫల్య పురస్కారాలుగా ఒక్కొక్కరికి లక్ష వంతున రూ.3 లక్షలు, మొత్తంగా రూ.5 లక్షల నగదు బహుమతిని అందచేస్తూ వస్తుందన్నారు. తాజాగా పాత్రికేయిలకు కూడా పురస్కారాలు అందించాలని నిర్ణయించామని తెలిపారు. పత్రికా సంపాదకీయలను ఒక ఉద్యమంగా, సామాజిక సంస్కరణలకు స్ఫూర్తిగా ఉపయోగించిన నార్ల, పత్రికా సమాజానికి దిక్సూచి వంటి వారని ఆయన పేరిట అవార్డులు ఇవ్వటం తమ సంస్థకు గౌరవంగా భావిస్తున్నామని యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ పేర్కొన్నారు.

జనం గుండె చప్పుడు

# మహానాడు

09

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ ||మంగళవారం 03, డిసెంబర్ 2024||

## షార్ట్ ఫిలిం అవార్డ్స్‌లో సాయిదుర్గ తేజ్ "సత్య"

హార్ట్ టచింగ్ షార్ట్ ఫిలింగా అందరి ప్రశంసలు పొందింది సుప్రీమ్ హీరో సాయిదుర్గ తేజ్ నటించిన "సత్య". ఈ షార్ట్ ఫిలిం ఫిలింఫేర్ షార్ట్ ఫిలిం అవార్డ్స్ 2024లో పీపుల్స్ ఛాయిస్ కేటగిరిలో అవార్డు గెల్చుకుంది. ఈ అవార్డు గెల్చుకున్న హ్యాపీ మూవ్ మెంట్ ను టీమ్ సోషల్ మీడియా ద్వారా షేర్ చేసుకున్నారు."సత్య" షార్ట్ ఫిలింలో స్వాతి రెడ్డి హీరోయిన్ గా నటించింది. హర్షిత్, హన్షిత నిర్మాతలుగా వ్యవహరించారు. విజయకృష్ణ వీకే దర్శకత్వం వహించారు. మ్యూజికల్ షార్ట్ ఫిలింగా "సత్య" ప్రేక్షకులకు మంచి అనుభూతిని ఇచ్చింది.



## 'కన్నప్ప'లో మంచు కూతుళ్ళు

డైనమిక్ హీరో విష్ణు మంచు డ్రీమ్ ప్రాజెక్ట్ అయిన 'కన్నప్ప' చిత్రం నుంచి వస్తున్న ప్రతీ అప్డేట్ ఆడియెన్స్‌లో అంచనాలు పెంచేస్తూనే ఉన్నాయి. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన రిలీజ్ డేట్‌ను ప్రకటించారు. అత్యంత భారీ క్రేజీ పాన్-ఇండియా ప్రాజెక్ట్ అయిన ఈ 'కన్నప్ప' ఏప్రిల్ 25, 2025న విడుదల కానుంది. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి సంబంధించిన మరో అప్డేట్‌ను సోమవారం నాడు రిలీజ్ చేశారు. కన్నప్ప ప్రచార కార్యక్రమంలో భాగంగా ప్రతీ సోమవారం ఓ అప్‌డేట్ ఇస్తామని మేకర్లు ఇది వరకు ప్రకటించారు. ఇందులో భాగంగా విష్ణు మంచు పిల్లలు అరియానా మంచు, వివియానా మంచు ఫస్ట్ లుక్‌లను విడుదల చేశారు. అంతే కాకుండా ఈ రోజు విష్ణు మంచు కవల కుమార్తెల పుట్టినరోజులు కావడం కూడా విశేషం.ఈ పోస్టర్‌లో పిల్లలిద్దరూ గిరిజన వేషధారణలో చాలా డిఫరెంట్‌గా కనిపిస్తున్నారు. శ్రీ కాళహస్తి పురాణ కథ ప్రాముఖ్యతను చాటి చెప్పే పాటలో కనిపించనున్నారు. 'పాట పాడినా, నృత్యం చేసినా, ఇది శివుని కోసం' అని ఈ పోస్టర్‌లో చూపించారు. ఈ మేరకు విష్ణు మంచు పోస్ట్ చేస్తూ.. 'పుట్టినరోజు సందర్భంగా నా కుమార్తెల ఫస్ట్‌లుక్‌ను రిలీజ్ చేయడం ఆనందంగా ఉంది అన్నారు.






## "పుష్ప 2' ది రూల్ నుండి 'పీలింగ్స్' సాంగ్

క్రియేటివ్ జీనియస్ సుకుమార్ దర్శకత్వంలో మైత్రి మూవీ మేకర్స్ అసోసియేషన్ విత్ సుకుమార్ రైటింగ్స్ పతాకంపై ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా, నేషనల్ క్రష్ రష్మిక మందన్న హీరోయిన్ గా ప్రేక్షకుల ముందుకు రాబోతున్న చిత్రం పుష్ప 2. 2021లో విడుదల అయిన పుష్ప 1 చిత్రానికి సీక్వెల్ గా ఈ చిత్రం డిసెంబర్ 5వ తేదీన ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. సునీల్, ఫహాద్ ఫాసిల్, జగపతి బాబు, రావు రమేష్, అనసూయ భరద్వాజ్, ధనుంజయ తదితరులు ఈ చిత్రంలో కీలకపాత్రలు పోషించనున్నారు. ఈ చిత్రానికి నవీన్ ఎర్నేని, రవిశంకర్ యెలమంచిలి నిర్మిస్తున్నారు. కాగా ఈ చిత్రం నుండి నేడు పీలింగ్స్ సాంగ్ విడుదల కావడం జరిగింది. దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందించినా ఈ పాటకు చంద్ర బోస్ లిరిక్స్ రాయగా శంకర్ బాబు కందుకూరి, లక్ష్మి దాస తమ స్వరాన్ని జోడించి ఈ పాటను పాడడం జరిగింది.



## మెహ్రీన్ మాయాజాలం

నాని హీరోగా నటించిన కృష్ణగాడి వీర ప్రేమ గాథ సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ మెహ్రీన్. ఈ అమ్మడిని కెరీర్ ఆరంభంలో జూనియర్ మిల్కీ బ్యూటీ అంటూ పిలిచే వారు. మిల్కీ బ్యూటీ తమన్నా మాదిరిగా స్కిన్ టోన్ అదిరి పోయిందని, మెహ్రీన్ కి సైతం మంచి ఫ్యూచర్ ఉందని కెరీర్ ఆరంభంలో చాలా మంది చాలా రకాలుగా అభిప్రాయం వ్యక్తం చేశారు. కానీ ఈ అమ్మడికి టాలీవుడ్‌లో ఆశించిన స్థాయిలో భారీ విజయాలు సొంతం కాలేదు. చేసిన కొన్ని సినిమాల్లో ఎక్కువ శాతం ఫ్లాప్‌లు ఉన్నాయి. ఎఫ్ 2 వంటి సినిమాల్లో మంచి పాత్రలు దక్కించుకున్నా ఆ తర్వాత ఎక్కువ ఆఫర్లు దక్కించుకోవడంలో మెహ్రీన్ ఫెయిల్ అయ్యింది. కెరీర్‌లో కొన్ని తప్పుడు నిర్ణయాల వల్ల ఆఫర్లు తగ్గాయి అంటూ ఆ మధ్య ఒక ఇంటర్వ్యూలో ఈ అమ్మడు చెప్పుకొచ్చింది. ఆ నిర్ణయాలు ఏంటి అనే విషయం పక్కన పెడితే సోషల్ మీడియాలో ఈమె ఇంకా అందమైన ఫోటోలను షేర్ చేస్తూనే ఉంది. తన అభిమానులతో పాటు నెటిజన్స్ ని మాయ చేస్తూ అందంతో మత్తు చల్లినట్లుగా కవ్విస్తోంది. ఈ స్థాయి అందాల ఆరబోత కేవలం మెహ్రీన్‌కే సాధ్యం అన్నట్లుగా నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. మహానుభావుడు, రాజా ది గ్రేట్, ఎఫ్ 2 సినిమాలతో సక్సెస్‌లు దక్కించున్న మెహ్రీన్ ఎఫ్ 3 తర్వాత పెద్దగా కనిపించడం లేదు. సినిమాల్లో ఎక్కువగా కనిపించకున్నా సోషల్ మీడియాలో మాత్రం మెహ్రీన్ రెగ్యులర్‌గా కనిపిస్తూనే ఉంది. ఆకట్టుకునే అందం తో పాటు మంచి ఫిజిక్ ఈ అమ్మడి సొంతం అనే విషయం ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. సోషల్ మీడియాలో ఈ అమ్మడు చేసే అందాల ఆరబోత ఫోటోల కారణంగా రెగ్యులర్‌గా వార్తల్లో ఉంటుంది. కనుక ముందు ముందు ఈమె మరిన్ని సినిమాల్లో నటించే అవకాశాలు ఉన్నాయి అంటూ ఇండస్ట్రీ వర్గాల వారితో పాటు ప్రేక్షకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



## సూపర్ స్టార్ ఉపేంద్ర 'UI ది మూవీ వార్నర్

కన్నడ సూపర్ స్టార్ ఉపేంద్ర స్వీయ దర్శకత్వంలో ఫస్ట్ అఫ్ ఇట్స్ కైండ్ ఫిల్మ్ UI ది మూవీ' చిత్రంతో రాబోతున్నారు. లహరి ఫిల్మ్స్, జి మనోహరన్ & వీనస్ ఎంటర్‌టైనర్స్ కెపి శ్రీకాంత్ నిర్మిస్తున్నారు. నవీన్ మనోహరన్ సహ నిర్మాత. ఈ రోజు, మేకర్స్ వార్నర్‌తో ముందుకు వచ్చారు, ఇది మూవీ వరల్డ్ లో ఒక గ్లింప్స్ ని అందిస్తోంది. కథ 2040 సంవత్సరంలో జరుగుతుంది, గ్లోబల్ వార్మింగ్, COVID-19, ద్రవ్యోల్బణం, ఏఐ, నిరుద్యోగం, యుద్ధం యొక్క నిరంతర ముప్పు అస్తవ్యస్తమైన, బాధాకరమైన సమాజానికి దారి తీస్తాయి. వినాశకరమైన పరిస్థితులు ఉన్నప్పటికీ, సామాజిక విభజనలు పాతుకుపోయాయి. కులం,మతం, సంఘర్షణ, విభజన మూలాలుగా వ్యక్తుల జీవితాల మారుస్తాయి. ఈ డిస్టోపియన్ వరల్డ్ లో ఉపేంద్ర నియంతగా కనిపించారు. మార్పు కోసం, న్యాయం కోసం, మంచి భవిష్యత్తు కోసం కష్టజీవుల నిరసనలకు దిగుతారు. ఇప్పుడు పవర్ ఫుల్ గా ఎంట్రీ ఇచ్చిన ఉపేంద్ర రూత్ లెస్‌గా కనిపించారు.

## "కన్యాకుమారి" 'యద యద సవ్వడి..'

గీత్ సైని, శ్రీచరణ్ రాచకొండ జంటగా నటిస్తున్న సినిమా "కన్యాకుమారి". ఈ చిత్రాన్ని రాడికల్ పిక్చర్స్ బ్యానర్ పై దర్శక నిర్మాతగా సృజన్ అట్టాడ రూపొందిస్తున్నారు. విలేజ్ బ్యాక్ డ్రాప్ ఎంటర్ టైనర్‌గా రూపొందుతున్న ఈ సినిమా అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. "కన్యాకుమారి" సినిమా నుంచి 'యద యద సవ్వడి..' లిరికల్ సాంగ్‌ను రిలీజ్ చేశారు. 'యద యద సవ్వడి..' సాంగ్‌కు సృజన్ అట్టాడ లిరిక్స్ అందించగా.. అనురాగ్ కులకర్ణి, జయశ్రీ పల్లెం పాడారు. రవి నిడమర్తి బ్యూటిఫుల్ గా ట్యూన్ చేశారు. 'యద యద సవ్వడి, చేసెను సందడి, నువ్వు నన్ను తాకగా, రేగెను అలజడి, అట్ట అట్ట సూడకే ఎట్ట ఎట్ట ఆపనే, పొంగుతున్న ప్రేమనే.. పిల్లా' అంటూ సాగుతుందీ పాట. "కన్యాకుమారి" సినిమా నుంచి ఇప్పటికే హీరో విజయ్ దేవరకొండ రిలీజ్ చేసిన టీజర్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది.



## మహేష్ చాలా ఎంజాయ్ చేస్తూ డబ్బింగ్ చెప్పారు.: నమ్రతా

మోస్ట్ ఎవైటెడ్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్ 'ముఫాసా: ది లయన్ కింగ్' డిసెంబర్ 20, 2024న ఇండియాలో ఇంగ్లీష్, హిందీ, తమిళం, తెలుగు భాషలలో విడుదల కానుంది. బారీ జెంకిన్స్ డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రం 2019లో లైవ్-యాక్షన్ ది లయన్ కింగ్ బ్లాక్ బస్టర్ విజయాన్ని కొనసాగిస్తూ ప్రేక్షకులని అలరించబోతోంది. 'ముఫాసా'కి సూపర్ స్టార్ మహేష్ బాబు వాయిస్ ఇస్తున్నారు. మహేష్ బాబు వాయిస్ ఓవర్ లో రిలీజైన ట్రైలర్ కు ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. ఈ రోజు అభిమానులకు స్పెషల్ ట్రీట్ ఇస్తూ సూపర్ స్టార్ మహేష్ బాబు అద్భుతమైన పోస్టర్‌ను నమ్రతా శిరోద్కర్ ఘట్టమనేని గ్రాండ్ మీడియా ఈవెంట్ లో లాంచ్ చేశారు. టాకా పాత్రకు వాయిస్ హీరో సత్యదేవ్, టిమోన్ పాత్ర వాయిస్ ఇచ్చిన అలీ ఈ వేడుకలో పాల్గొన్నారు. పుంబా పాత్రకు బ్రహ్మానందం, కిరోస్ పాత్రకు అయ్యప్ప పి శర్మ వాయిస్ అందించారు. నమ్రతా శిరోద్కర్ ఘట్టమనేని మాట్లాడుతూ.. డిస్నీ టీంకి థాంక్ యూ. చాలా శ్రద్ధతో ఈ ప్రాజెక్ట్ ని చేశారు. ఇలాంటి ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్ ని డబ్ చేయడం ఒక ఛాలెంజ్, డిస్నీ టీం చాలా ఎఫెర్ట్ పెట్టి అద్భుతంగా తెలుగు ఆడియన్స్ ముందుకు తీసుకొస్తున్నారు. ఇది ఫ్యామిలీ ఫిల్మ్. ఎమోషనల్ రైడ్. మహేష్ బాబు చాలా ఎంజాయ్ చేస్తూ డబ్బింగ్ చెప్పారు. సినిమా అద్భుతంగా వచ్చింది. తప్పకుండా అందరికీ నచ్చుతుందనే నమ్మకం వుంది'అన్నారు.



Published by **Bodepudi Venkata Subbarao Managing Director** on behalf of Mahanadu Media pvt ltd. **Editor: Marthi Subrahmanyam** Phone: 9705311144